రిపోర్టర్లు కావలెను

జనం కోసం నిరంతరం అక్షర సమరం చేసేందుకు దూసుకు వస్తున్న 'జర్నలిస్ట్ ఫైల్' దినపత్రికకు ఏపీలో జిల్లా ప్రతినిధులుగా పనిచేయుటకు విలేకరులు కావలెను. తెలుగులో స్పష్టంగా మాట్లాడటం, ఆసక్తి, అనుభవం ఉన్న వారికి ప్రాధాన్యత. కొత్త వారికి అవకాశం ఉంటుంది.

సంప్రదించాల్సిన సెల్ నెం : 9502535152, 7416812467

మంగళవారం 09.07.2024

INK OF TRUTH

జర్నలిస్ట్ ఫైల్

తెలుగు దినపత్రిక

సంపుటి - 32 సంచిక -152 www.journalistfile.com పేజీలు 4 వెల : రూ.5.00

పర్యావరణ పరిరక్షణే ధ్యేయంగా ముందడుగు

- పిఠాపురంలో పవన్ వినూత్న ప్రయోగం..
- పర్యావరణహితంగా వేడుకలు... ఉత్సవాలు చేసుకొంటే మేలు
- వినాయక చవితికి మట్టి వినాయకులను పూజించేలా ప్రజలకు అవగాహన
- ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్

అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) : రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చేపట్టిన పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, పర్యావరణ, అటవీ, శాస్త్ర సాంకేతిక శాఖలపై వరుసగా సమీక్షలు చేస్తూ ప్రజా ప్రయోజనాలు, అభివృద్ధి, అటవీ సంరక్షణ, పర్యావరణ పరిరక్షణకు నిర్మాణాత్మక సూచనలు, అందుకు అనుగుణంగా ఆదేశాలు ఇస్తున్నారు. ఈ క్రమంలో స్వచ్ఛంద సంస్థలు, నిపుణులు, వివిధ వర్గాల ప్రజల నుంచి పలు సూచనలు, అభిప్రాయాలూ శ్రీ పవన్ కళ్యాణ్ గారి కార్యాలయానికి అందుతున్నాయి. తమ అనుభవాలను తెలియచేస్తూ నివేదికలు పంపిస్తున్నారు. ఆదివారం మంగళగిరిలో పవన్ కళ్యాణ్ నివాసంలో ప్రకృతి వ్యవసాయ నిపుణుడు, పర్యావరణ ప్రేమికుడు విజయ రామ్ కలిశారు. పర్యావరణానికి హాని చేయని విధంగా వస్తువుల వినియోగాన్ని పెంచేందుకు, ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించేందుకు అవసరమైన సూచనలు చేశారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన గోవింద భోగ్, రత్న చోడి, మాప్పిల్లై సాంబ తదితర బియ్యం రకాలను చూపించారు.

పిఠాపురం నియోజకవర్గంలో ప్రయోగాత్మకంగా... : ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ "పర్యావరణహితమైన వస్తువుల వాడకాన్ని మన వేడుకలు, ఉత్సవాల్లో వాడితే మేలు కలుగుతుంది. వినాయక చవితి రాబోతుంది. ఈ వేడుకల్లో మట్టి గణపతి ప్రతిమలను పూజిస్తే పర్యావరణానికి ప్రయోజనం కలుగుతుంది. జల కాలుష్యాన్ని అరికట్టవచ్చు. మట్టి గణపతికి పూజలపై ప్రజలకు అవగాహన కల్పించాలి. ఇందులో భాగంగా పిఠాపురం నియోజకవర్గంలో మట్టితో చేసిన వినాయక విగ్రహాలు పూజించేందుకు తగిన ఏర్పాట్లు చేయాలని నిర్ణయించాము. అదే విధంగా దేవాలయాల్లో ప్రసాదాలను బటర్ పేపర్ తో చేసిన కవర్లలో అందిస్తున్నారు. బటర్ పేపర్ వినియోగాన్ని తగ్గించాలని పలువురు నిపుణులు సూచించారు. అలాంటి కవర్ల స్థానంలో చిన్నపాటి తాటాకు బుట్టలు, ఆకులతో చేసిన దొన్నెలు వాడితే అవి వ్యర్థాల నిర్వహణ కూడా సులభం. వీటి వినియోగాన్ని పిఠాపురం నియోజకవర్గంలో ఉన్న ఆలయాల్లో ప్రయోగాత్మకంగా చేపట్టేందుకు కార్యాచరణ రూపొందించబోతున్నాము" అన్నారు.

అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) : ఏపీలో ఉచిత ఇసుక పాలసీపై జీవో వచ్చేసింది. ఉచిత ఇసుక జీవోను రాష్ట్ర ప్రభుత్వం సోమవారం మధ్యాహ్నం విడుదల చేసింది. పాత ఇసుక విధానాన్ని రద్దు చేస్తూ సర్కార్ ఉత్తర్వులు ఇచ్చింది. 2024 ఇసుక విధానం రూప కల్పన వరకూ సరఫరాకు మార్గదర్శకాలు జారీ చేసింది. 2019లో అప్పటి ప్రభుత్వం తీసుకువచ్చిన ఇసుక విధానాన్ని ప్రభుత్వం రద్దు చేసింది. కొత్త ఇసుక విధానాన్ని తెచ్చే వరకు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. అప్పటి వరకు వినియోగదారుడికి ఉచితంగా ఇసుక ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు జీవో నంబర్ 43ను జారీ చేసింది. వినియోగదారుడు ఎత్తుడు, దించుడు కూలీతో ఇతర చట్టబద్ధమైన పన్నులు చెల్లించాల్సి ఉంటుందని ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాల్లో పేర్కొంది.

ప్రభుత్వ మార్గదర్శకాలు ఇవే...

వైసీపీ ప్రభుత్వంలోని 2019, 2021 ఇసుక విధానాలను రద్దు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. గత ప్రభుత్వం ఇచ్చిన రెండు ఇసుక పాలసీలను రద్దు చేస్తున్నట్టు ఏపీ ప్రభుత్వం ప్రకటించింది. ఈ మేరకు ఉచిత ఇసుకపై విధి విధానాలు ఖరారు చేస్తూ జీవో విడుదల చేసింది. 2024 కొత్త ఇసుక విధానాన్ని రూపొందించేంత వరకు కొత్త మార్గదర్శకాలు జారీ చేసింది. రాష్ట్ర ఖజానాకు రెవెన్యూ లేకుండా ఇసుక సరఫరా జరపాలని ఉత్తర్వుల్లో పేర్కొంది. వినియోగదారులకు ఇసుకను అందుబాటులోకి తేవడమే లక్ష్యంగా ఇసుక సరఫరాపై మార్గదర్శకాల విడుదల చేసింది. ఇసుక తవ్వకాల నిమిత్తం జిల్లా కలెక్టర్ చైర్మన్‌గా జిల్లా స్థాయి కమిటీల ఏర్పాటుకు సర్కార్ ఆదేశాలు జారీ చేసింది. జిల్లా ఇసుక కమిటీల్లో జిల్లా ఎస్పీ, జేసీ సహా వివిధ శాఖలకు చెందిన జిల్లా స్థాయి అధికారులు ఉండనున్నారు. జిల్లాల్లోని స్టాక్ పాయింట్లను స్వాధీనం చేసుకోవాలని జిల్లా ఇసుక కమిటీలకు సర్కార్ సూచనలు చేసింది.

49 లక్షల మెట్రిక్ టన్నుల మేర ఇసుక రాష్ట్రంలోని వివిధ స్టాక్ పాయింట్లల్లో అందుబాటులో ఉందని ప్రభుత్వం వెల్లడించింది. రిజర్వాయర్లు, చెరువులు, ఇతర నీటి వనరుల్లో డి-సిల్టేషన్ ప్రక్రియకు ఆదేశించింది. డి-సిల్టేషన్ ప్రక్రియ ఎక్కడెక్కడ చేపట్టాలనే అంశాలపై జిల్లా స్థాయి కమిటీలు నిర్ణయం తీసుకోనున్నాయి. ఇసుక లోడింగ్, రవాణ ఛార్జీలను నిర్ధారించే బాధ్యతను జిల్లా కమిటీకి అప్పగిస్తూ నిర్ణయం తీసుకుంది. స్టాక్ పాయింట్ల వద్ద లోడింగ్, రవాణా ఛార్జీల చెల్లింపులను కేవలం డిజిటల్ విధానం ద్వారా జరపాలని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఇసుకను తిరిగి విక్రయించినా ఇతర రాష్ట్రాలకు తరలించినా కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించింది. భవన నిర్మాణ మినహా ఉచిత ఇసుకను మరే ఇతర అవసరాలకు వినియోగించొద్దని స్పష్టం చేసింది. ఇసుక అక్రమ రవాణా చేసినా, ఫిల్లింగ్ చేసినా పెనాల్టీలను నిర్ధారిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

కాగా.. సోమవారం నుంచి ఉచిత ఇసుక పాలసీ అమలులోకి వస్తుండటంతో ఉదయం నుంచే స్టాక్ పాయింట్స్ వద్ద వాహనాలు బారులు తీరాయి. అయితే ఉదయం ఇసుక పాలసీపై ప్రభుత్వం నుంచి జీవో ఇంకా విడుదల కాకపోవడంతో అధికారులు ఎదురు చూపులు చూశారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారులు.. సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లగా వెంటనే జీవో విడుదల చేయాలని ఆదేశాలు జారీ చేశారు. దీంతో మధ్యాహ్నానికి ఉచిత ఇసుక పాలసీపై ప్రభుత్వం జీవోను విడుదల చేసింది. అధికారుల మధ్య సమన్వయ లోపమే జీవో విడుదలకు ఆలస్యం అని కింద స్థాయి అధికారులు తెలిపారు.

పోలవరం నిర్మాణానికి ఎన్డీఏ కట్టుబడి ఉంది

- వైద్యారోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ కీలక వ్యాఖ్యలు

రాజమహేంద్రవరం (జర్నలిస్ట్ ఫైల్) : పోలవరం ప్రాజెక్టును సకాలంలో పూర్తి చేయడానికి కేంద్ర ప్రభుత్వ సహాయ సహకారాలు ఉంటాయని రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ తెలిపారు. రాజమహేంద్రవరంలో ఆయన మీడియాతో మాట్లాడారు. "రాష్ట్ర విభజన సందర్భంలో పోలవరం గురించి పోరాడింది భాజపానే. పోలవరాన్ని జాతీయ ప్రాజెక్టుగా చేసి ఖర్చులను 90 శాతం కేంద్రం, 10 శాతం రాష్ట్ర ప్రభుత్వం భరించేలా చేసింది భాజపా నాయకత్వమే. ముంపు మండలాలపై తొలి క్యాబినెట్ భేటీలోనే నిర్ణయం తీసుకుంది. విభజన నేపథ్యంలో రాష్ట్రానికి జరిగిన అన్యాయాన్ని సరిచేయడం కోసం మా పార్టీ పూర్తి సహకారం అందిస్తోంది. ఆంధ్రప్రదేశ్కు జీవనాడి అయిన పోలవరాన్ని అతి త్వరగా పూర్తి చేసే బాధ్యత తీసుకుంటామని ప్రధాని నరేంద్రమోదీ చెప్పారు. గత ప్రభుత్వ చేతగాని తనం, ప్రాజెక్టును ఆదాయ వనరుగా మార్చుకోవడం వల్ల డయాఫ్రం వాల్ దెబ్బతిన్న విషయం తెలిసిందే. దాన్ని ఎలా సరిచేయాలనే విషయంపై నిపుణులు అధ్యయనం చేస్తున్నారు. పోలవరం పూర్తి చేసేందుకు కృషి చేస్తాం. అమరావతిపై కూడా జగన్ వికృత రాక్షస క్రీడకు శ్రీకారం చుట్టారు. అమరావతి రాజధానిగా ఉండాలని భాజపా కోరుకుంటోంది. అవుటర్ రింగ్ రోడ్డును గత ప్రభుత్వం విస్మరించినా కేంద్ర ప్రభుత్వం మళ్లీ ఆమోదం తెలిపింది. కనెక్టివిటీ పెరిగి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెరిగే ప్రాజెక్టు అది. దాని ద్వారా రాష్ట్రానికి ఆదాయం, జీఎస్టీ వస్తుంది" అని సత్యకుమార్ అన్నారు.

చంద్రబాబుపై నోరు పారేసుకుంటే చూస్తూ ఊరుకోం..

- టీడీపీ ఎమ్మెల్యే సోమిరెడ్డి ఫైర్

నెల్లూరు (జర్నలిస్ట్ ఫైల్) : తెలుగు రాష్ట్రాల ప్రయోజనాల కోసమే ఏపీ సీఎం చంద్రబాబు, తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి భేటీ అయ్యారని సర్వేపల్లి టీడీపీ ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి అన్నారు. ఒక్క అడుగు తగ్గి సీఎం చంద్రబాబే హైదరాబాద్‌కు వెళ్లారని తెలిపారు. కేసుల కారణంగా కేంద్రం నుంచి వాటాలు తేలేకపోయామని చెప్పారు. విభజన అంశాలపై ముఖ్యమంత్రుల సమావేశంపై మాజీ మంత్రి, వైసీపీ నేత కాకాణి వ్యాఖ్యలు విమర్శలు చేయడం సరికాదని హితవు పలికారు. మరోసారి చంద్రబాబుపై నోరు పారేసుకుంటే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు.

విభజన అంశాలపై తెలుగు రాష్ట్రాల భేటీపై మాజీ మంత్రి కాకాణి నిన్న తీవ్ర విమర్శలు చేశారు.. వ్యవసాయ శాఖ మంత్రిగా కాకాణి ఆ రంగానికి ఏమీ చేయలేదని సోమిరెడ్డి

2 లో

సిమెంట్ ఫ్యాక్టరీలో ప్రమాద ఘటన ...

- మృతుడి కుటుంబానికి రూ.50 లక్షల పరిహారం
- సిమెంట్ ఫ్యాక్టరీలో బాయిలర్ పేలుడు చాలా దురదృష్టకరం
- యాజమాన్యం, ప్రభుత్వం నుంచి క్షతగాత్రులకు తక్షణ సాయం
- నష్టపరిహారంపై త్వరలోనే గౌరవ ముఖ్యమంత్రి ప్రకటన
- రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్

అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) : ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేట మండలం బూదవాడ గ్రామంలో ఉన్న ఆల్ట్రాటెక్ సిమెంట్ కర్మాగారంలో బాయిలర్ పేలిన ఘటన బాధితులను రాష్ట్ర కార్మిక, కర్మాగార, బాయిలర్స్ & వైద్య బీమా సేవల శాఖ మంత్రివర్యులు వాసంశెట్టి సుభాష్ పరామర్శించారు. సోమవారం విజయవాడలోని మణిపాల్ (8 మంది), ఆంధ్రా ఆస్పత్రుల్లో (8 మంది) చికిత్స పొందుతున్న క్షతగాత్రులను పరామర్శించి వారి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సిమెంట్ ఫ్యాక్టరీలో బాయిలర్ పేలిన ఘటన చాలా దురదృష్టకరమన్నారు. మొత్తం 16 మంది గాయపడ్డారని, వీరిలో మణిపాల్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఒకరు మరణించారని తెలిపారు.

మృతుడి కుటుంబానికి రూ.50 లక్షల పరిహారం..

మృతుడి కుటుంబానికి రూ.50 లక్షల పరిహారం అందించేందుకు యాజమాన్యం అంగీకరించినట్లు వెల్లడించారు. బాధితుల కుటుంబసభ్యులకు ప్రమాద సమాచారం పంపించడం జరిగిందన్నారు. క్షతగాత్రుల యోగక్షేమాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించేందుకు అధికారులను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. కార్మికులకు ఈఎస్ఐ, ఇన్సూరెన్స్ వంటి పథకాలను కార్మికులకు సదరు సిమెంట్ ఫ్యాక్టరీ వర్తింపజేస్తున్నదీ లేనిదీ విచారించి వెంటనే చర్యలు తీసుకుంటామన్నారు.

2 లో

ఇక 'అన్నదాత సుఖీభవ'

అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) : ఆంధ్రప్రదేశ్ లో ఎన్డీయే కూటమి ప్రభుత్వం కొలువుదీరింది. ఈ నేపథ్యంలో టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టారు. అయితే ఎన్నికల సమయంలో ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాల హామీల అమలుపై సీఎం చంద్రబాబు ప్రత్యేక ఫోకస్ పెట్టారు. ఇప్పటికే ఎన్డీయే కూటమి అధికారంలోకి రాగానే మెగా డీఎస్సీ పై తొలి సంతకం చేశారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు పై సంతకం చేసిన సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా ప్రభుత్వం ఎన్నికల హామీల అమలుపై కసరత్తు ప్రారంభించింది. ఈ క్రమంలోనే రైతు భరోసా పై రాష్ట్రప్రభుత్వం ఫోకస్ చేసినట్లు తెలుస్తోంది. చంద్రబాబు సర్కార్ రైతులకు ఆర్థికంగా తోడ్పాటు అందించే పథకం పేరు 'అన్నదాత సుఖీభవ' గా ఖరారు చేసింది.

వైసీపీ ప్రభుత్వం గతంలో వైఎస్సార్ రైతు భరోసా పేరుతో రైతులకు ఏడాదికి రూ 13,500 చొప్పున అందించేవారు. ఈ క్రమంలో ఎన్నికల ప్రచారంలో అధికారంలోకి వస్తే రైతులకు రూ. 20 వేలు ఇస్తామని టీడీపీ కూటమి హామీ ఇచ్చింది. అయితే

2 లో

ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తికి ఊరట..

- ఏపీ హైకోర్టు కీలక ఆదేశాలు

అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) : ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తికి ఏపీ హైకోర్టు ఊరటనిచ్చింది. తనపై వేసిన అనర్హత వేటును సవాలు చేస్తూ జంగా కృష్ణమూర్తి దాఖలు చేసిన పిటిషన్‌పై ఇవాళ ఏపీ హైకోర్టు విచారణ జరిపింది. ఎమ్మెల్సీ స్థానం ఖాళీగా ఉన్నట్లు నోటిఫై చేయొద్దని ఈసీకి ఆదేశాలు జారీ చేసింది. అనంతరం విచారణను వాయిదా వేసింది.

వైసీపీ తరఫున ఎమ్మెల్సీగా గెలిచిన జంగా కృష్ణమూర్తి ఎన్నికలకు ముందు టీడీపీలో చేరారు. దీంతో ఫార్టీ ఫిరాయించినందుకు గానూ ఆయనపై వేటు వేయాలని అప్పటి విప్ అప్పిరెడ్డితో పాటు వైసీపీకి చెందిన పలువురు

2 లో

చంద్రబాబు దూరదృష్టికి నిదర్శనం పట్టిసీమ

- పట్టిసీమ ద్వారానే కృష్ణా డెల్టాకు త్రాగు, సాగునీరు
- జగన్ పట్టిసీమను వట్టి సీమ అన్నందుకు ప్రజలకు క్షమాపణ చెప్పాలి
- మంత్రి నిమ్మల రామానాయుడు

అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) : ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దీక్ష దక్షత, దూర దృష్టికి నిదర్శనం పట్టిసీమ అని రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. నేడు పట్టిసీమ ద్వారా అందే గోదావరి జలాలే కృష్ణా డెల్టాకు త్రాగు, సాగునీరుగా అందుతున్నాయన్నారు. సోమవారం ఇబ్రహీంపట్నం ఫెర్రీ ఘాట్ వద్ద గోదావరి జలాలు కృష్ణాలో కలిసే పవిత్ర సంగమానికి ఎంపీ కేశినేని నాని, మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు లతో కలిసి మంత్రి రామానాయుడు పూజ నిర్వహించి జలహారతిని ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆనాడు తెలుగుజాతి బిడ్డ కే ఎల్ రావు రాష్ట్రాన్ని కరువు కాటకాలు, దుర్భిక్షం నుంచి కాపాడుకోవాలంటే నదుల అనుసంధానం ద్వారానే సాధ్యమని తెలిపారని, ఆ కలలు పట్టిసీమ ద్వారా గోదావరి, కృష్ణా నదుల అనుసంధానం ద్వారా నిజం చేసింది చంద్రబాబేనన్నారు.

గత ఐదు రోజుల కిందట 17 పంపులు ద్వారా పట్టిసీమకు విడుదల చేసిన గోదావరి జలాలు పోలవరం కుడి కాలువ ద్వారా కృష్ణ డెల్టాకు ఇప్పటివరకు 6,100 క్యూసెక్కుల నీరు చేరిందని మంత్రి రామానాయుడు తెలిపారు. మరో 8 పంపులను దశలవారీగా విడుదల చేస్తామని మొత్తంగా 24 పంపుల ద్వారా 8వేల క్యూసెక్కుల నీరు చేరుతుందన్నారు. ఈ నీరు కృష్ణ డెల్టా లోని 30 లక్షల మంది ప్రజలకు త్రాగు, 10 లక్షలకు పైగా ఆయకట్టుకు సాగుకు ఆధారమన్నారు. కృష్ణా డెల్టాకు గోదావరి జలాలు అందడం వలన శ్రీశైలం ప్రాజెక్టు నుంచి వచ్చే నీరు రాయలసీమకు పంపే అవకాశం కలుగుతుందని మంత్రి రామానాయుడు తెలిపారు. ఇటువంటి పట్టిసీమను అసెంబ్లీలో ఒట్టి సీమ అన్న జగన్ ప్రజలకు, తెలుగుజాతికి క్షమాపణ చెప్పాలని, ప్రజాస్వామ్యంలో రాజకీయాల్లో ఉండే అర్హత లేదన్నారు.

పురుషోత్తపట్నం ద్వారా ఏలేరు రిజర్వాయర్ కు అందే గోదావరి జలాలు విశాఖ స్టీల్ ప్లాంట్ తో పాటు విశాఖ ప్రజలకు తాగునీరుగా అందుతుందన్నారు. ప్రతి ఏటా వృధా అవుతున్న గోదావరి జలాలను సద్వినియోగం చేసుకునే పోలవరం ప్రాజెక్టు నాలుగైదు సంవత్సరాలు ఆలస్యం అవుతుందనే దూర దృష్టితోనే

2 లో

వైసీపీ పాలన ఏపీలో ఎమర్జెన్సీని తలపించింది

బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో దగ్గుబాటి పురందేశ్వరి

రాజమండ్రి (జర్నలిస్ట్ ఫైల్) : వైసీపీ పాలన ఏపీలో ఎమర్జెన్సీని తలపించిందని ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి వ్యాఖ్యలు చేశారు. రాజమండ్రిలో జరుగుతున్న బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ఎంపీ మాట్లాడుతూ.. జగన్ పాలనలో హిందూ దేవాలయాలపై దాడులు జరిగాయన్నారు. జగన్ ఎంత నొక్కేసారో ప్రజలు గమనించి ఎన్నికల్లో ఓడించారని తెలిపారు. బాధ్యతతో మెలుగుతూ ఏపీ అభివృద్ధికి సహకరిద్దామని ఎంపీ పురందేశ్వరి వెల్లడించారు.

ప్రతిపక్షాల దుష్ప్రచారం వల్లే...

ఎన్నికల్లో ఎన్డీయే కూటమికి ప్రజలు బ్రహ్మరథం పట్టారన్నారు. ప్రపంచంలో ఐదవ ఆర్థిక శక్తిగా భారతదేశం ఎదిగిందన్నారు. 2019లో బీజేపీకి 23 కోట్ల ఓట్లు వచ్చాయని.. 2024 ఎన్నికల్లో 24 కోట్ల ఓట్లు వచ్చాయని తెలిపారు. బీజేపీకి గత ఎన్నికల కంటే ఈ ఎన్నికల్లో ఓట్ల సంఖ్య పెరిగిందన్నారు. ప్రతిపక్షాల దుష్ప్రచారం వల్ల ఎంపీ సీట్ల సంఖ్య కొంచెం తగ్గిందన్నారు. కాంగ్రెస్ రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్‌ను అవమానించిందన్నారు. మోదీ ప్రభుత్వం రాజ్యాంగాన్ని గౌరవిస్తుందని స్పష్టం చేశారు. ఎన్డీయే కూటమి ఏపీకి సుపరిపాలన అందిస్తుందని ప్రజలు అధికారం ఇచ్చారని ఎంపీ పురందేశ్వరి పేర్కొన్నారు.

హాజరైన వారు వీరే..

రాజమండ్రిలో నిర్వహించిన బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సమావేశానికి బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి అరుణ్ సింగ్, కేంద్ర మంత్రులు మురుగన్, శ్రీనివాస వర్మ, రాష్ట్ర మంత్రి సత్య కుమార్, ఎంపీలు దగ్గుబాటి పురందేశ్వరి, సీఎం రమేష్, ఎమ్మెల్యేలు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి కామినేని శ్రీనివాస్, ఆదినారాయణ రెడ్డి, విష్ణుకుమార్ రాజు, సుజనాచౌదరి, ఈశ్వరరావు, పార్థసారథి హాజరయ్యారు.

ఇడుపులపాయలో వైఎస్ఆర్‌కు నివాళులర్పించిన కుటుంబీకులు

కడప (జర్నలిస్ట్ ఫైల్) : ఇడుపులపాయలో వైఎస్ఆర్‌కు ఆయన కుటుంబీకులు ఘన నివాళులర్పించారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి జయంతి వేడుకలను వైసీపీ, కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. సోమవారం వైఎస్ఆర్ 75వ జయంతి సందర్భంగా ఇడుపులపాయలోని వైఎస్ఆర్ ఘాట్ వద్ద ఏర్పాటు చేసిన వేడుకలకు మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి, పిసిసి చీఫ్ షర్మిలా రెడ్డి, విజయమ్మ, వైఎస్ సుధీకర్ రెడ్డి, ఎంపి అవినాష్ రెడ్డి, భారతి రెడ్డిలు హాజరయ్యారు. దీంతో వేరు వేరుగా ఘాట్ వద్దకు హాజరైన మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి, పిసిసి చీఫ్ షర్మిలా రెడ్డిలు తమ తండ్రి వైఎస్ఆర్ కు నివాళులర్పించారు.

పులివెందుల నుండి 7.55 నిమిషాలకు మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి రాగా అప్పటికే ఘాట్ వద్ద తల్లి విజయమ్మ కుమారుడు జగన్ కోసం వేచి ఉండడం జరిగింది. 10 నిమిషాలపాటు ఘాట్ వద్ద ప్రార్థనలు చేసిన మాజీ సిఎం సమీపంలోని వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాలలతో నివాళులర్పించారు. అనంతరం అక్కడికి వచ్చిన వైసీపీ కార్యకర్తలు, నాయకులను జగన్ పలకరించారు. అనంతరం ఇడుపులపాయలోని గెస్ట్ హౌస్ కు వెళ్లకుండా నేరుగా వైఎస్ఆర్ ఘాట్ వద్ద నుండి రోడ్డు మార్గం గుండా కడపకు బయలుదేరి వెళ్లారు. మాజీ సిఎం జగన్ ఘాట్ వద్ద నుండి

వెళ్లిన తర్వాత 8.45 నిమిషాలకు పిసిసి చీఫ్ షర్మిలా రెడ్డి తన భర్త అనిల్ కుమార్, తల్లి విజయమ్మ, కుమార్తె అంజలి, కుమారుడు రాజారెడ్డి, కోడళ్ళు అట్లూరి ప్రియా, పిసిసి మీడియా ఛైర్మన్ తులసిరెడ్డితో కలిసి వైఎస్ఆర్ ఘాట్ వద్దకు విచ్చేశారు. షర్మిలా రెడ్డి దాదాపు అరగంటపాటు ప్రత్యేక ప్రార్థనలు చేసి పూలమాలలతో నివాళులర్పించారు. అలాగే సమీపంలోని వైఎస్ఆర్ విగ్రహానికి నివాళులర్పించారు. అనంతరం పిసిసి చీఫ్ షర్మిలా రెడ్డి విలేకరులతో మాట్లాడుతూ వైఎస్ఆర్ ఒక డైనమిక్ లీడర్ అన్నారు. నాయకుడు అంటే ఎలా ఉండాలని ఆదర్శంగా నిరూపించిన నాయకుడు వైఎస్ఆర్ అన్నారు. గొప్ప పరిపాలన అందించారు కాబట్టే ఆయన మరణానంతరం వైఎస్ఆర్ వెనకాల 700 మంది చనిపోయినట్లు తెలిపారు. వైఎస్ఆర్ గురించి చెప్పాల్సిన అవసరం లేదన్నారు. తెలుగు రాష్ట్ర ప్రజలందరికీ వైఎస్ఆర్ 75వ జయంతి శుభాకాంక్షలు అన్నారు. మాజీ సీఎం ఇడుపులపాయకు రావడంతో దారి పొడవున పోలీసులు గస్తీ నిర్వహించారు. అలాగే ఘాట్ లోకి ఎక్కువ మందిని పోలీసులు అనుమతించలేదు. సిఎం హోదాలో ఉన్న సమయంలో ఇడుపులపాయలో ఎన్ని చెక్ పోస్టులు పెట్టారో అదే మాదిరిగా చెక్ పోస్టులు పెట్టి పోలీసులు తనీఖీలు చేశారు. మాజీ సిఎం జగన్ వెంట కడప ఎంపి అవినాష్ రెడ్డి, తిరుపతి ఎంపి గురుమూర్తి, అరకు ఎంపి తనూజా రాణి, ఎర్రగొండపాలెం ఎమ్మెల్యే చంద్రశేఖర్, బద్వేల్ ఎమ్మెల్యే డాక్టర్ సుధా, రాజంపేట ఎమ్మెల్యే అమర్నాథ్ రెడ్డి, ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి, గోవింద్ రెడ్డి, రమేష్ యాదవ్, మాజీ మంత్రి ఉషశ్రీ, మాజీ ఎమ్మెల్యేలు శ్రీకాంత్ రెడ్డి, రాచమల్లు శివప్రసాద్ రెడ్డి, రవీంద్రనాథ్ రెడ్డి, రఘురాం రెడ్డి, చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, మాజీ శాసన మండలి డిప్యూటీ చైర్మన్ సతీష్ రెడ్డి, జడ్పీటీసీ రవికుమార్ రెడ్డి, మండల కన్వీనర్ చంద్ర ఓబుల్ రెడ్డి, మాజీ సివిల్ సప్లరు డైరెక్టర్ షబ్బీర్ లు రాగా షర్మిలా వెంట పిసిసి మీడియా ఛైర్మన్ తులసిరెడ్డి, కాంగ్రెస్ నాయకులు ధఅవకుమార్ రెడ్డి, ఇర్ఫాన్ బాష, సలావుద్దీన్, విజయ జ్యోతి, అష్ఫల్ ఖాన్ తో పాటు ఉమ్మడి కడప జిల్లాకు చెందిన ముఖ్య నేతలు ఉన్నారు.

చాంద్ భాషా ఆధ్వర్యంలో కదం తొక్కిన ప్రభుత్వ ఉద్యోగులు

● **తమ నాయకుడు కేఆర్ సూర్యనారాయణ పై అక్రమ కేసులు ఎత్తివేయాలంటూ భారీ ర్యాలీ**

గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్) : గుంటూరు నగరంలోని నగరంపాలెం పోలీస్ పరేడ్ గ్రౌండ్స్ నుండి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగ ఉపాధ్యాయుల ఐక్యవేదిక సభ్యులు భారీ ఎత్తున ర్యాలీగా తరలివచ్చి ఏపీజీఈఏ రాష్ట్ర అధ్యక్షులు కేఆర్ సూర్యనారాయణ పై పెట్టిన అక్రమ కేసులు ఉపసంహరించుకోవాలని , అక్రమ కేసులు పెట్టిన వారిపై తగు చర్యలు తీసుకోవాలని నినాదాలు చేస్తూ గుంటూరు కలెక్టర్ కార్యాలయానికి చేరుకున్నారు. జిల్లా రెవెన్యూ అధికారి పెద్ది రోజాకు ఈ మేరకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా గుంటూరు జిల్లా అధ్యక్షులు చాంద్ భాషా మాట్లాడుతూ... ఏపీజీఈఏ రాష్ట్ర అధ్యక్షులు కేఆర్ సూర్యనారాయణ పై కేసులను ఉపసంహరించేలా చర్యలు తీసుకోవాలని సభ్యులు కోరారు.

ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు చాంద్ బాషా తో పాటుగా ... కార్యదర్శి శివారెడ్డి, కార్యనిర్వాహక కార్యదర్శి కరిముల్లా షాఖాదరి, సహా అధ్యక్షులు హుస్సేన్ ఖాన్, మహేష్ బాబు, మహిళ విభాగం ప్రధాన కార్యదర్శి సుమిత్రా దేవి, సహా అధ్యక్షురాలు హేమలత, నగర శాఖ అధ్యక్షులు నాగేశ్వరరావు, కార్యదర్శి సాంబశివరెడ్డి, పెదరత్తయ్య, కార్యనిర్వాహక కార్యదర్శి ఆశ సజని, జిల్లా పెన్షనర్ల విభాగం అధ్యక్షులు కేశవరెడ్డి, రాష్ట్ర ప్రధానకార్యదర్శి మత్తయ్య, ఆంధ్ర ప్రదేశ్ గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు అబ్దుల్ రజాక్ జిల్లా అధ్యక్షులు టీవీఎస్ మణికంఠ తో పాటు పెద్ద సంఖ్యలో ఉద్యోగులు పాల్గొన్నారు .

సిమెంట్ ఫ్యాక్టరీలో ప్రమాద ఘటన ...

(మొదటి పేజీ తరువాయి)

క్షతగాత్రులకు యాజమాన్యం, ప్రభుత్వం నుంచి తక్షణ సాయం అందేవిధంగా చర్యలు తీసుకుంటామని చెప్పారు.

నష్టపరిహారంపై త్వరలోనే ప్రకటన.. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందుతోందని, మృతుడు ఆవుల వెంకటేష్ కుటుంబాన్ని ఆదుకుంటామని అన్నారు. గాయపడినవారిలో స్వామి, అర్జునరావు, గోపీనాయక్ పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపినట్లు పేర్కొన్నారు. పేలుడు ధాటికి సైదా అనే వ్యక్తికి గొంతు వద్ద బలమైన గాయం జరిగిందని, మరో క్షతగాత్రుడు శివనారాయణ కంటిచూపు 95 శాతం దెబ్బతిందని వెల్లడించారు. బాధితులందరికీ నష్టపరిహారంపై గౌరవ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు త్వరలోనే నిర్ణయం తీసుకుంటారని స్పష్టం చేశారు. విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) ఫ్యాక్టరీ పేలుడు ఘటన బాధితులను పరామర్శించి మాట్లాడుతూ.. ప్రభుత్వం వారిని అన్నివిధాల ఆదుకుంటుందన్నారు. క్షతగాత్రులకు మెరుగైన చికిత్స అందించాలని వైద్యులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కార్మికశాఖ కమిషనర్ ఎం. శేషగిరిబాబు, విజయవాడ ఆర్డీవో బి. హెచ్. భవానీ శంకర్, డీఎంహెచ్‌వో ఎం. సుహాసిని, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తికి ఊరట..

(మొదటి పేజీ తరువాయి)

సభ్యులు మండలి చైర్మన్ మోషెన్ రాజుకు ఫిర్యాదు చేశారు. దీంతో జంగా కృష్ణమూర్తిపై అనర్హత వేటు వేస్తూ మండలి చైర్మన్ గెజిట్ నోటిఫికేషన్ జారీ చేశారు. దీంతో జంగా కృష్ణమూర్తి ఏపీ హైకోర్టును ఆశ్రయించారు. తన వివరణ తీసుకోకుండానే అనర్హత వేటు వేశారని.. ఇది కక్షపూరిత చర్య అని హైకోర్టులో పిటిషన్ వేశారు. పార్టీ మారిన టీడీపీ ఎమ్మెల్యేల మీద ఏళ్ల తరబడి చర్యలు తీసుకోకుండా తనపై మాత్రం వేటు వేయడమేంటని పిటిషన్‌లో పేర్కొన్నారు. దీంతో ఈ పిటిషన్‌పై సోమవారం విచారణ జరిపిన న్యాయస్థానం.. జంగా కృష్ణమూర్తి స్థానం ఖాళీ అయినట్లు నోటిఫై చేయొద్దని ఈసీకి సూచించింది.

ఎమ్మెల్సీ ఇందుకూరి రాజాపై అనర్హత వేటు పడిన నేపథ్యంలో.. ఆ స్థానం ఖాళీ అయినట్లు నోటిఫై చేయొద్దని ఈసీకి ఏపీ హైకోర్టు ఇటీవల ఆదేశాలు ఇచ్చిన సంగతి తెలిసిందే. పార్టీ వ్యతిరేక కార్యాకలాపాలకు పాల్పడుతున్నారని ఆరోపిస్తూ ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజుపై శాసనమండలి చైర్మన్ మోషెన్ రాజుకు.. విప్ పాలవలస విక్రాంత్ ఇటీవల ఫిర్యాదు చేశారు. దీంతో వైసీపీ ఎమ్మెల్సీ రఘురాజును అనర్హుడిగా ప్రకటిస్తూ ఈ నెల 3వ తేదీన మండలి చైర్మన్ ఉత్తర్వులు జారీ చేశారు. అయితే చైర్మన్ నిర్ణయాన్ని సవాలు చేస్తూ ఇందుకూరి రాజా హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై విచారణ జరిపిన హైకోర్టు.. ఇందుకూరి రాజా స్థానం ఖాళీ అయినట్లు నోటిఫై చేయొద్దని ఆదేశాలు జారీ చేసింది. తదుపరి విచారణను ఈ నెల 10వ తేదీకి వాయిదా వేసింది.

చంద్రబాబు దూరదృష్టికి నిదర్శనం పట్టిసీమ

(మొదటి పేజీ తరువాయి)

చంద్రబాబు పట్టిసీమ, పురుషోత్తపట్నం ఎత్తిపోతల పథకాలను నిర్మాణం చేశారన్నారు. ఆనాడు పట్టిసీమ పథకమునకు 1300 కోట్లు వెచ్చిస్తే కృష్ణా డెల్టా లోని 30 లక్షల ఎకరాలకు అందిన సాగునీటి ద్వారా 50 వేల కోట్లు వరకు రైతులకు ఆదాయం సమకూరిందని మంత్రి రామానాయుడు తెలిపారు. జగన్ ప్రభుత్వం ఐదేళ్లలో పట్టిసీమను నిర్లక్ష్యం చేశారని మంత్రి రామానాయుడు తెలిపారు. జగన్ రాజకీయాలు, ఎన్నికల స్వార్థంతో ఎప్పుడు పులిచింతల రిజర్వాయర్ లో 30 నుంచి 35 టీఎంసీలు నిల్వ ఉండే నీరు నేడు అర టీఎంసీ కూడా లేదని మంత్రి రామానాయుడు తెలిపారు. సమావేశంలో ఎంపీ కేశినేని చిన్నీ, మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు, గుడివాడ ఎమ్మెల్యే వెలంగడ్ల రాము, సంబంధిత శాఖ అధికారులతో పాటు పలువురు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఇక 'అన్నదాత సుఖీభవ'

(మొదటి పేజీ తరువాయి)

మూడు విడతల్లో ఈ మొత్తం రైతుల ఖాతాల్లో జమ చేసే అవకాశం ఉందని అధికార వర్గాలు చెబుతున్నాయి. ఈ క్రమంలో ప్రభుత్వం పోర్టల్ ప్రారంభించిన తరువాత విధివిధానాలను ఖరారు చేయనున్నట్లు సమాచారం. రాష్ట్ర ప్రభుత్వం రూ. 14వేలు, పీఎం కిసాన్ నిధులు రూ. 6000 చొప్పున మొత్తాన్ని అన్నదాతలకు అందించనుంది. కుటుంబంలో ఒక్కరు మాత్రమే ఈ పథకం కింద లబ్ధి పొందేలా నిబంధనలు ఖరారు అవుతున్నట్లు సమాచారం.

చంద్రబాబుపై నోరు పారేసుకుంటే చూస్తూ ఊరుకోం..

(మొదటి పేజీ తరువాయి)

ఆరోపించారు. మైక్రో ఇరిగేషన్ కోసం కేంద్రం ఇచ్చిన నిధులను కూడా ఖర్చు చేయలేకపోయారని విమర్శించారు. జగన్ ఒక నియంతలా వ్యవహరించారని, ఆయన హయాం కర్ఫ్యూని తలపించిందని అన్నారు. వైసీపీ పాలనలో తిరుమలను భ్రష్టు పట్టించారని, ఆలయ పవిత్రతను దెబ్బతీశారని మండిపడ్డారు. బెంగళూరు రేవ్ పార్టీలో కాకాణి కారు పాస్ దొరికిందని చెప్పారు. వైసీపీ హయాంలో రాష్ట్రం డ్రగ్స్, గంజాయికి కేంద్రంగా మారిందని ఆగ్రహం వ్యక్తం చేశారు

చంద్రబాబు సక్సెస్ అయ్యారు.. సజ్జల సంచలన వ్యాఖ్యలు

అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) : అసాధ్యమైన హామీలతో ప్రత్యర్థులు అందలం ఎక్కారని వైసీపీ నేత సజ్జల రామకృష్ణారెడ్డి అన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగోలేదని చెబుతూ.. హామీలను ఎగ్గొట్టాలని చంద్రబాబు చూస్తున్నారని మండిపడ్డారు. అలవికాని హామీలివ్వడం ఎందుకు? ఇప్పుడు అమలు చేయలేమని చేతులెత్తేయడం ఎందుకని ప్రశ్నించారు.

వైసీపీ కార్యాలయంలో వైఎస్సార్ జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్ విగ్రహానికి నివాళులు అర్పించిన అనంతరం సజ్జల రామకృష్ణారెడ్డి మీడియాతో మాట్లాడారు. అసాధ్యమైన హామీలతో ప్రత్యర్థులు అందలం ఎక్కారని సజ్జల ఆరోపించారు. అధికారంలోకి వచ్చిన వారు హామీలను అమలు చేయలేమని సన్నాయి నొక్కులు నొక్కుతున్నారని మండిపడ్డారు. ఇప్పటికప్పుడు హామీలు అమలు చేయడం సాధ్యం కాదన్నట్లుగా చంద్రబాబు మాట్లాడుతున్నారని తెలిపారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగోలేదని చంద్రబాబు అంటున్నారని.. ఆర్నెల్ల క్రితం హామీలిచ్చేప్పుడు రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అంచనా లేదా అని ప్రశ్నించారు. అలవికాని హామీలివ్వడం ఎందుకు? ఇప్పుడు

అమలు చేయలేమని చేతులెత్తేయడం ఎందుకని మండిపడ్డారు.

చంద్రబాబు ఇచ్చిన హామీల్లో కనీసం 10 శాతం హామీలు ఇచ్చినా కూడా వైసీపీకి ఈ పరిస్థితి వచ్చేది కాదని పలువురు అంటున్నారని సజ్జల తెలిపారు. కానీ అది జగన్ పద్ధతి కాదని పేర్కొన్నారు. అలవికాని హామీలిచ్చి ప్రజల్ని మోసం చేయడం జగన్‌కు ఇష్టం లేదని స్పష్టం చేశారు. పదే పదే అలా మోసం చేయడంలో చంద్రబాబు సక్సెస్ అయ్యారని ఎద్దేవా చేశారు. ఇచ్చిన హామీలను చంద్రబాబు ప్రభుత్వం అమలు చేయాలని డిమాండ్ చేశారు.

ఇచ్చిన హామీలు అమలు చేయలేకపోతే చంద్రబాబును అందరూ కలిసి నిలదీద్దామని సజ్జల పిలుపు నిచ్చారు. రాష్ట్రానికి ఏ ఇబ్బంది కలిగినా వైసీపీ చూస్తూ ఊరుకోబోదని తెలిపారు. ప్రజల పక్షాన పోరాటానికి తమ పార్టీ ఎప్పుడూ సిద్ధమేనని స్పష్టం చేశారు.

వైఎస్ ఆశయ సాధన కోసం జగన్ ఎంతో కృషి చేశారని సజ్జల తెలిపారు. ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేశామని అన్నారు. కుల, మత, ప్రాంత, రాజకీయ పార్టీలతో సంబంధం లేకుండా జగన్ పరిపాలన చేశారని అన్నారు. విద్య, వైద్య రంగాల్లో జగన్ విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారని తెలిపారు. ఇళ్ల ముంగిటకే పరిపాలనను తెచ్చారని అన్నారు.

అల్ట్రాటెక్ ఫ్యాక్టరీని ముట్టడించిన గ్రామస్తులు ...లాఠీచార్జ్

ఎన్టీఆర్ జిల్లా , జగ్గయ్యపేట (జర్నలిస్ట్ ఫైల్) : అల్ట్రాటెక్ సిమెంట్ ఫ్యాక్టరీ వద్ద సోమవారం ఉదయం ఉద్రిక్తత చోటుచేసుకుంది. ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేట మండలం బూదవాడ గ్రామంలోని అల్ట్రాటెక్ సిమెంట్ కర్మాగారంలో ఆదివారం అగ్నిప్రమాదం జరిగిన సంగతి విదితమే. ఈ నేపథ్యంలో ఈరోజు ఉదయం అల్ట్రాటెక్ సిమెంట్ ఫ్యాక్టరీ ఘటనలో మృతులు, తీవ్రంగా గాయపడినవారికి కలెక్టర్ సృజన, ఎమ్మెల్యే శ్రీరామ్ రాజగోపాల్, తదితరులు చెక్కులను పంపిణీ చేశారు. దీనికిముందుగా నేటి ఉదయం ఫ్యాక్టరీ వద్ద ఉద్రిక్తత చోటుచేసుకుంది. గ్రామస్తులంతా ఒక్కసారిగా ఫ్యాక్టరీని ముట్టడించే ప్రయత్నం చేశారు. దీంతో పోలీసులు వారిని అడ్డుకున్నారు. పరిస్థితి మరింత ఉద్రిక్తంగా మారడంతో ఎన్టీఆర్ జిల్లా డిప్యూటీ పోలీస్ కమిషనర్ కే. శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఫ్యాక్టరీ వద్దకు వచ్చిన ప్రత్యేక పోలీసు బలగాలతో లాఠీచార్జి చేశారు. ఈ ఘటనలో గ్రామస్తులలోని పలువురికి గాయాలయ్యాయి.

అల్ట్రాటెక్ సిమెంట్ ఫ్యాక్టరీలో మృతులు, తీవ్రంగా గాయపడినవారికి చెక్కులు పంపిణీ చేసిన కలెక్టర్ సృజన, ఎమ్మెల్యే శ్రీరామ్ రాజగోపాల్ తదితరులు

ఈ క్రమంలో బాధిత కుటుంబ సభ్యులకు చెక్కులు అందజేసేందుకు రెవిన్యూ శాఖ అధికారులు అక్కడికి చేరుకున్నారు. బాధిత

కుటుంబ సభ్యుల నుండి బ్యాంక్ అకౌంట్, ఆధార్ కార్డ్ సేకరించే పనులు చేశారు. జగ్గయ్యపేట మండలం బుధవాడ గ్రామంలో జరిగిన ఈ ఘటనపై ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ క్షేత్రస్థాయి పరిశీలన చేపట్టారు. క్షతగాత్రుల కుటుంబ సభ్యులు, బంధువులతో కలెక్టర్ సృజన మాట్లాడి వారికి తగిన న్యాయం చేస్తామని ప్రభుత్వం నుండి రావలసిన మొత్తాన్ని వెంటనే ఇప్పిస్తామని వారి పిల్లలకు ఉచితంగా చదువుకునే సదుపాయాన్ని కల్పిస్తామని హామీ ఇచ్చారు. గాయపడినవారు పూర్తిగా కోలుకునే వరకు కూడా వారికి వైద్యం అందిస్తామని, వారి కుటుంబాలకు అన్ని విధాలుగా న్యాయం చేస్తామని ఎమ్మెల్యే, కలెక్టర్ హామీ ఇచ్చారు. ఫ్యాక్టరీని సందర్శించిన జిల్లా కలెక్టర్ సృజన బాధిత మృతులకు రూ. 50 లక్షలు, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం, తీవ్రంగా గాయపడిన వారికి రూ. 25 లక్షలు, స్వల్పంగా గాయపడినవారికి రూ. 5 లక్షలు పరిహారం ఇవ్వనున్నట్లు తెలిపారు. గ్రామంలో ప్రత్యేకంగా మెడికల్ క్యాంపు నిర్వహించడంతోపాటు మృతులు, తీవ్రంగా గాయపడినవారి కుటుంబాల్లో చదువుకునే పిల్లలకు కంపెనీ యాజమాన్యం చదువు చెప్పించేలా అంగీకారం వెంటనే తీసుకుంటామని బాధితులకు కలెక్టర్ సృజన, ఎమ్మెల్యే రాజగోపాల్ తెలిపారు.

వైఎస్సారే నాకు స్ఫూర్తి.. ఎంతో నేర్చుకున్నా

● **ఆ లక్షణాలు షర్మిలలో చూశా**

● **కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ**

అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) : దివంగత నేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి అసలైన ప్రజా నాయకుడు అని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ అన్నారు. వైఎస్సార్ 75వ జయంతి సందర్భంగా రాహుల్ నివాళులర్పించారు. వైఎస్సార్‌తో తమకున్న అనుబంధాన్ని ఈ సందర్భంగా కాంగ్రెస్ అగ్రనేత గుర్తుచేసుకున్నారు. ఎల్లప్పుడూ ప్రజల కోసమే బ్రతికిన నాయకుడు వైఎస్సార్ అని కొనియాడారు. ఆయన మరణం అత్యంత విషాదమన్నారు. రాజశేఖర్ రెడ్డి బ్రతికి ఉంటే ఏపీ ముఖచిత్రం వేరేలా ఉండేదని చెప్పుకొచ్చారు. వైఎస్సార్ బ్రతికి ఉంటే ఈ రోజు ఆంధ్రప్రదేశ్‌కు ఈ పరిస్థితి ఉండేది కాదని.. కష్టాలు,కన్నీళ్లు ఉండేవి కావని రాహుల్ తెలిపారు.

ఆ లక్షణాలు షర్మిలలో చూశా....

తండ్రి వారసత్వాన్ని కూతురు షర్మిల సమర్ధవంతంగా ముందుకు తీసుకెళ్తారని.. ఆ నమ్మకం తనకు బలంగా ఉందని స్పష్టం చేశారు. షర్మిల న్యాయకత్వంలో పార్టీ బలోపేతం అవుతుందని ధీమా వ్యక్తం చేశారు. వైఎస్సార్‌లో ఉన్న ధైర్యం, సిద్ధాంతాలు, న్యాయకత్వ లక్షణాలు షర్మిలలో చూశానన్నారు. తాను వ్యక్తిగతంగా వైఎస్సార్ నుంచి ఎంతో నేర్చుకున్నానని.. ఆయన పాదయాత్ర తన జోడో యాత్రకు స్ఫూర్తి అని చెప్పుకొచ్చారు. నాడు రాజశేఖర్‌రెడ్డి ఎండను, వర్షాన్ని లెక్క చేయకుండా పాదయాత్ర చేశారని గుర్తుచేశారు. ఆయనే తనకు స్ఫూర్తి అన్నారు. నేడు 75వ జయంతి సందర్భంగా వైఎస్సార్‌కు ఘన నివాళులు అర్పిస్తున్నానని రాహుల్ గాంధీ పేర్కొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే మా ప్రభుత్వ ధ్యేయం

● **సచివాలయంలో ప్రజల నుంచి వినతులు స్వీకరించిన మంత్రి డా. డోలా బాల వీరాంజనేయస్వామి**

అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) : ప్రజా సమస్యల పరిష్కారమే తమ ప్రభుత్వ ధ్యేయమని తమ దృష్టికి వచ్చిన ప్రతి సమస్యకు సత్వరమే పరిష్కారం చూపుతామని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి అన్నారు. సోమవారం నాడు వెలగపూడిలోని సచివాలయంలో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి మంత్రి వినతులు స్వీకరించారు. వృద్ధులు విభిన్న ప్రతిభావంతుల అసోసియేషన్ ప్రతినిధులు, రాష్ట్ర గ్రామ వార్డు సచివాలయం అసోసియేషన్ ప్రతినిధులు మంత్రిని కలిసి తమ సమస్యలపై వినతి పత్రాలు అందించారు. సాధ్యమైనంత త్వరలో సమస్యలు పరిష్కరిస్తామని వారికి మంత్రి హామీనిచ్చారు. ఈ సందర్భంగా విభిన్న ప్రతిభావంతులకు అందించే వినికిడి యంత్రాలు ప్లాస్టిక్ పరికరాలు వైసీపీ ప్రభుత్వ నిలిపేసిందని గత 5 ఏళ్ల నుంచి ఏ ఒక్కరికి ఇవ్వలేదని మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అర్హులైన వారందరికీ యంత్రాలు ప్లాస్టిక్ పరికరాలు అందజేస్తామని హామీ ఇచ్చారు. విశాఖ జిల్లా గాజువాకకు చెందిన యువకుడు తాను క్యాన్సర్ తో బాధపడుతున్నానని ఫించన్ మంజూరు చేయాలని మంత్రిని కోరారు. త్వరలోనే పింఛన్ మంజూరు చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు. గ్రామ సచివాలయ వార్డు సచివాలయ ఉద్యోగుల అసోసియేషన్ ప్రతినిధులు మంత్రిని కలిసి తమ సమస్యలు విన్నవించుకున్నారు రూరల్ ఏరియాలో గ్రామ సచివాలయంలో పనిచేస్తున్న డిజిటల్ అసిస్టెంట్ లపైపని భారం పెరిగిపోతుందని టెక్నికల్ స్కిల్స్ అధికంగా ఉన్న డిజిటల్ అసి స్టెంట్లను పాఠశాలలు, కాలేజీల్లో టెక్నికల్ విధులకు సంబంధించి తమ సేవలు వినియోగించుకోవాలని, గౌరవప్రదమైన వేతనం అందించాలని మంత్రిని కోరారు. గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థ పై పూర్తిస్థాయిలో అధ్యయనం చేసి నూతన విధివిధానాలు రూపొందిస్తామని మంత్రి తెలిపారు.

దివ్యాంగ విద్యార్థులకు ల్యాప్ టాప్ లు గిఫ్ట్ గా ఇచ్చిన మంత్రి నారా లోకేష్

అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) : ఏపీ మంత్రి నారా లోకేష్ ఆదేశాల మేరకు యుద్ధప్రాతిపదికన జీవో 225 విడుదల చేయడంతో రాష్ట్రంలోని పలువురు దివ్యాంగులకు మేలు చేకూరింది. ఆ జీవో వల్ల ఐఐటీ, ఎన్ఐటీ, ట్రిపుల్ ఐటీ వంటి ప్రముఖ విద్యాసంస్థల్లో 25 మంది దివ్యాంగ విద్యార్థులు సీట్లు సాధించారు. దీంతో వారంతా తల్లిదండ్రులతో కలిసి ఉండవల్లిలోని మంత్రి నారా లోకేష్ నివాసానికి వచ్చి ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను మంత్రి లోకేశ్ అభినందించడంతోపాటు వారికి ల్యాప్టాప్లను బహుకరించారు. 'సింపుల్ గవర్నమెంట్ – ఎఫెక్టివ్ గవర్నెన్స్' విధానంతో ప్రజలకు అత్యుత్తమ సేవలు అందించడమే తమ లక్ష్యమని మంత్రి లోకేష్ తెలిపారు.

వాట్సప్ మెసేజ్ తో తక్షణం స్పందించారు... ఆదుకున్నారు

దివ్యాంగ విద్యార్థుల ఉన్నత భవిష్యత్తుకు మంత్రి నారా లోకేష్ ఆధ్వర్యంలోని విద్యా శాఖ అండగా నిలిచింది. జాతీయ విద్యా సంస్థల్లో సీట్లు కోల్పోయే స్థితి నుంచి గట్టెక్కించింది. మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి నారా లోకేశ్ చొరవతో ఇంటర్ విద్యాశాఖ ఆగమేఘాలపై వారికి కొత్త మార్కుల మెమోలు జారీచేసి, వారి సీట్లు వారికి దక్కేలా చూసింది. ఐఐటీ, ఎన్ఐటీ, ట్రిపుల్ ఐటీల్లో సీట్లు పోయినట్లేనని భావించిన విద్యార్థులకు సీట్లు దక్కాయి. వివరాలివీ.. జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్షల్లో దివ్యాంగ కోటాలో 170 ర్యాంకు సాధించిన విజయవాడ విద్యార్థి పృథ్వీ సత్యదేవ్ చైన్నై ఐఐటీలో సీటు వస్తుందని భావించాడు. జాయింట్ సీట్ అలకేషన్ అథారిటీ(జోసా) పెట్టిన కొత్త నిబంధనతో సీటు కోల్పోయే ప్రమాదం ఏర్పడింది. దివ్యాంగ విద్యార్థులకు ఇంటర్మీడియట్‌లో భాషా సబ్జెక్టుల్లో ఒక దాంట్లో మినహాయింపు ఉంటుంది. అంటే తెలుగు లేదా ఇంగ్లీషలో ఒక సబ్జెక్టు రాయాల్సిన అవసరం లేదు. సెకండియర్‌లో మిగిలిన ఐదు సబ్జెక్టులకు ఆ విద్యార్థులకు మార్కుల మెమోలు ఇస్తారు. సెలవు దినాల్లోనూ అధ

తెలంగాణా వార్తలు

వైఎస్సార్ పథకాలు దేశానికే ఆదర్శం సీఎం రేవంత్

హైదరాబాద్ (జర్నలిస్ట్ ఫైల్) : వైఎస్సార్ సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలిచాయన్నారు సీఎం రేవంత్‌రెడ్డి. గాంధీ భవన్ లో సోమవారం జరిగిన వైఎస్సార్ జయంతి వేడుకలలో ఆయన పాల్గొన్నారు.. ఇక్కడ ఏర్పాటు చేసిన వైఎస్సార్ ఫోటో ఎగ్జిబిషన్ ను ప్రారంభించారు. ఈ సందర్భంగా రేవంత్ మాట్లాడుతూ, వైఎస్సార్ ముద్ర ప్రజల గుండెల్లో భద్రంగా ఉందన్నారు. సంక్షేమం అంటే వైఎస్సార్ గుర్తుకొస్తారని చెప్పారు. కాంగ్రెస్ ఆరు గ్యారంటీలకు వైఎస్సార్ సంక్షేమమే స్ఫూర్తి అని అన్నారు. వైఎస్సార్ భౌతికంగా ప్రజల మధ్య లేకున్నా ఆయన స్ఫూర్తి బతికే ఉంటుందన్నారు. వైఎస్ అకాల మరణం కాంగ్రెస్ కు తీరని లోటన్నారు. వైఎస్సార్ నిజమైన వారసులు కాంగ్రెస్ లో కి రావాలని సూచించారు. వైఎస్సార్ ఆశయాలను కొనసాగిస్తాని తెలిపారు. గ్రేటర్ హైదరాబాద్ అభివృద్ధికి వైఎస్సార్ ఎంతో కృషిచేశారని చెప్పారు. రాహుల్ జోడో యాత్రకు వైఎస్సార్ పాదయాత్ర స్ఫూర్తి అని వెల్లడించారు.

ప్రధాని పదవికి ఒక్క అడుగు దూరంలో రాహుల్

ప్రధాని పదవికి రాహుల్ ఒక్క అడుగు దూరంలో ఉన్నారని చెప్పారు సీఎం రేవంత్. రాహుల్‌ను ప్రధానిని చేసే వరకు కార్యకర్తలు కష్టపడాలని కోరారు. రాహుల్ ప్రధాని అయితేనే పేదలకు మేలు జరుగుతుందన్నారు. రాహుల్ ను ప్రధాని చేయడమే లక్ష్యమని వైఎస్సార్ చెప్పారన్నారు.

పంజాగుట్టలో..

దివంగత వైఎస్సార్ జయంతి సందర్భంగా పంజాగుట్టలోని వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు సీఎం రేవంత్ రెడ్డి. ఈ సందర్భంగా రాజశేఖర్ రెడ్డి చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమానికి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, దీపాదాస్ మున్షీ, ఎంపీలు, ఎమ్మెల్యేలు హాజరయ్యారు.

ఎమ్మెల్సీ కవిత లిక్కర్ కేసులో విచారణ శుక్రవారానికి వాయిదా

హైదరాబాద్ (జర్నలిస్ట్ ఫైల్) : లిక్కర్ పాలసీ సీబీఐ కేసులో డిఫాల్ట్ బెయిల్ కోరుతూ రౌస్ అవెన్యూ కోర్టులో ఎమ్మెల్సీ కవిత వేసిన పిటిషన్‌పై విచారణ వాయిదా పడింది. ఈ కేసులో సోమవారం మధ్యాహ్నం రెండు గంటలకు విచారణ ప్రారంభం కాగా.. సీబీఐ జూన్ 7న వేసిన ఛార్జిషీట్‌లో తప్పులు ఉన్నాయని, అందుకే ఎమ్మెల్సీ కవితని రిలీజ్ చేయాలంటూ ఆమె తరఫు న్యాయవాది కోర్టును కోరారు. సీబీఐ రీఫైలింగ్ చేసిన ఛార్జిషీట్‌లోనూ తప్పులు ఉన్నాయని న్యాయవాది కోర్టుకు తెలిపారు. దీంతో వచ్చే గురువారం లోపు కౌంటర్ దాఖలు చేయాలని సీబీఐకి రౌస్ అవెన్యూ కోర్టు ఆదేశాలు జారీ చేసింది.

అనంతరం కవిత దాఖలు చేసిన పిటిషన్ విచారణనను శుక్రవారానికి వాయిదా వేసింది. లిక్కర్ కేసులో కవిత పాత్రపై సీబీఐ దాఖలు చేసిన ఛార్జిషీట్ పరిగణలోకి తీసుకునే అంశంపై శుక్రవారం రోజున విచారణ జరగనుంది. ఎమ్మెల్సీ కవిత అరెస్టై నాలుగు నెలలు గడుస్తున్నా.. ఆమెకు బెయిల్ మాత్రం లభించడం లేదు. దీంతో రకరకాల ప్రయత్నాలు చేస్తూ ప్రస్తుతం డిఫాల్ట్ బెయిల్ కోసం పిటిషన్ దాఖలు చేశారు..

6 ప్రాజెక్టులపై సీఎం రేవంత్ స్పెషల్ ఫోకస్

హైదరాబాద్ (జర్నలిస్ట్ ఫైల్) : రాష్ట్రంలో అసంపూర్తిగా ఉన్న పలు సాగునీటి ప్రాజెక్టులను వీలైనంత తొందరగా వినియోగంలోకి తీసుకురావాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంకల్పించారు. ఇప్పటికే ప్రాజెక్టుల మీద నిధులు ఖర్చు పెట్టినవి.. అసంపూర్తిగా ఉన్నవి.. గత ప్రభుత్వం నిర్లక్ష్యంగా వదిలేసిన సాగునీటి ప్రాజెక్టులను రైతులకు అందుబాటులోకి తీసుకురావాలని కీలక నిర్ణయం తీసుకున్నారు.

వీటిలో తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆయకట్టుకు సాగునీటిని అందించే ప్రాజెక్టులపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక దృష్టి కేంద్రీకరించారు. అటు గోదావరి బేసిన్ తో పాటు ఇటు కృష్ణా బేసిన్ లో అర్థాంతరంగా ఆగిపోయిన ప్రాజెక్టుల వివరాలన్నీ ఇరిగేషన్ ఇంజనీర్ల నుంచి ఆరా తీశారు.

దాంతో పాటూ రైతులకు సాగునీటిని అందించాలంటే ఆయకట్టు భూములకు నీళ్లను పారించే డిస్ట్రిబ్యూటరీ వ్యవస్థలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సీఎం అధికారులను ఆదేశించారు. గత ప్రభుత్వం పదేండ్లలో చేపట్టిన ప్రాజెక్టులన్నీ బ్యారేజీలు, పంప్ హౌజులకే పరిమితమయ్యాయి. భారీగా అప్పులు తెచ్చి కాళేశ్వరం ఎత్తిపోతల ప్రాజెక్టు నిర్మించటం తప్ప మెయిన్ కాల్వలు, డిస్ట్రిబ్యూటరీలు, ఆయకట్టుకు నీటిని అందించే కాల్వలు నిర్మించకుండానే వదిలేసింది. అదే తరహాలో గత ప్రభుత్వం చేపట్టిన చాలా ప్రాజెక్టులు అసంపూర్తిగా మిగిలిపోయాయి. వీటన్నింటి మీదా అధికారులు దృష్టి పెట్టాలని వాటిని పూర్తి చేయాలని రేవంత్ రెడ్డి ఆదేశించారు. ఇటీవల పలు దఫాలుగా ఈ ప్రాజెక్టులపై చర్చించిన ముఖ్యమంత్రి తక్కువ ఖర్చుతో పూర్తయ్యే ప్రాజెక్టులు, వీలైనంత తొందరగా సాగునీటిని అందించేందుకు వీలున్న ప్రాజెక్టులను చేపడితే రైతులకు మేలు జరుగుతుందని, అందుకు అవసరమైన అంచనాలు సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. ఇందులో భాగంగా గోదావరి బేసిన్ లో ఉన్న నీలం వాగు, పింప్రి ప్రాజెక్టు, పాలెం వాగు, మత్తడి వాగు, ఎస్సారెస్పీ స్టేజీ 2, సదర్మట్ ప్రాజెక్టులను వేగంగా పూర్తి చేయాలని నిర్ణయించారు. ఈ ప్రాజెక్టులకు సంబంధించి పనులు పూర్తి చేసేందుకు దాదాపు రూ. 241 కోట్లు ఖర్చవుతుం దని, దాదాపు 48 వేల ఎకరాల ఆయకట్టుకు నీరు అందుతుందని ఇరిగేషన్ విభాగం అంచనాలు రూపొం దించింది. తక్కువ నిధులతో పూర్తయ్యే ఈ ప్రాజెక్టుల పనులను వీలైనంత తొందరగా పూర్తి చేపట్టాలని, వచ్చే ఏడాది 2025 మార్చి నాటికి వందకు వంద శాతం పనులు పూర్తి చేయాలని నిర్ణయం తీసుకున్నారు. అందుకు వీలుగా నిర్ణీత గడువు నిర్దేశించుకోవాలని, ఆయకట్టుకు నీరందించే లక్ష్యంతో సమగ్ర ప్రణాళిక తయారు చేయాలని సీఎం అధికారులను ఆదేశించారు. నీలంవాగు ద్వారా మంచిర్యాల జిల్లా, పింప్రి లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్ ద్వారా నిర్మల్ జిల్లా, పాలెం వాగు తో జయశంకర్ భూపాలపల్లి జిల్లా, మత్తడివాగుతో ఆదిలాబాద్ జిల్లా, ఎస్సారెస్పీ స్టేజీ 2తో వరంగల్, మహబూబాబాద్, ఖమ్మం, జనగాం, సూర్యాపేట జిల్లాలకు, సదర్మట్ ప్రాజెక్టుతో నిర్మల్ జిల్లాలోని రైతులకు సాగునీరు అందుతుంది.

బిఆర్ఎస్ నుంచి మరో వికెట్ డౌన !

❍ రేవంత్ తో ఎమ్మెల్సీ వెంకట్రామిరెడ్డి భేటి



హైదరాబాద్ (జర్నలిస్ట్ ఫైల్) : ఇప్పటికే ఆరుగురు బిఆర్ఎస్ ఎమ్మెల్సీలు హస్తం తీర్థం పుచ్చుకోగా తాజాగా మరోవైపు బీఆర్ఎస్‌కు చెందిన మరో ఎమ్మెల్సీ కారు పార్టీకి రాజీనామా చేసేందుకు సిద్ధమవుతున్నారు.. బీఆర్ఎస్ ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామి రెడ్డి కాసేపటి క్రితం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిశారు. అలంపూర్ అసెంబ్లీ నియోజకవర్గంలో సాగునీరు అందించే నెట్టెంపాడు, ఆర్డీఎస్ ప్రాజెక్టు పనులను వెంటనే పూర్తి చేయాలని ఎమ్మెల్సీ కోరినట్లు వార్తలు వస్తున్నాయి.. అయితే పార్టీని వీడేందుకు చల్లా నేడు రేవంత్ కలిసినట్లు ఆ పార్టీ వర్గాలు చెబుతున్నాయి.. రేపు కాంగ్రెస్ పార్టీలో చేరే అవకాశం ఉందని కాంగ్రెస్ పార్టీ వర్గాల్లో టాక్.

నిరసనలు తెలిపేందుకు అవకాశమివ్వండి.. పోలీసు కాళ్లు మొక్కిన ఓ నిరుద్యోగి

హైదరాబాద్ (జర్నలిస్ట్ ఫైల్): డీఎస్సీ రాత పరీక్షలను మూడు నెలల పాటు వాయిదా వేయాలని నిరుద్యోగులు డిమాండ్ చేస్తున్న సంగతి తెలిసిందే. అయితే ఇవాళ డైరెక్టరేట్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ ముట్టడికి డీఎస్సీ అభ్యర్థులు పిలుపునిచ్చారు. దీంతో భారీ సంఖ్యలో డీఎస్సీ అభ్యర్థులు స్కూల్ ఎడ్యుకేషన్ కార్యాలయం వద్దకు చేరుకున్నారు. నిరసన తెలుపుతున్న నిరుద్యోగులను పోలీసులు అరెస్టు చేశారు.

ఈ సందర్భంగా నిరుద్యోగి తన ఆవేదనను వ్యక్తం చేశాడు. నిరసనలు తెలిపేందుకు అవకాశం ఇవ్వండంటూ ఆ అభ్యర్థి పోలీసు ఆఫీసర్ కాళ్లు మొక్కి వేడుకున్నాడు. మేం శాంతియుతంగా నిరసన వ్యక్తం చేస్తున్నాం.. ఎలాంటి అరాచకాలకు పాల్పడడం లేదు.. మా డిమాండ్లను ప్రభుత్వానికి విన్నవించుకుంటున్నామని పేర్కొన్నాడు. ఇప్పుడున్న కాంగ్రెస్ గవర్నమెంట్ కంటే బీఆర్ఎస్ గవర్నమెంటే బెటర్ అంటూ అతను తెలిపాడు.

ఇక డైరెక్టరేట్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ కార్యాలయం వద్ద చేరుకున్న ప్రతి అభ్యర్థిని పోలీసులు అరెస్టు చేసి వివిధ పోలీసు స్టేషన్లకు తరలించారు. దీంతో అక్కడ ఉద్రిక్త వాతావరణం నెలకొంది. పోలీసులు భారీగా మోహరించారు. 25 వేల పోస్టులతో మెగా డీఎస్సీ ప్రకటించాలని నిరుద్యోగులు డిమాండ్ చేస్తున్నారు.

కాంగ్రెస్ లో పదవుల పండగ

❍ 35 కార్పోరేషన్లకు చైర్మన్‌ల నియామకం

హైదరాబాద్ (జర్నలిస్ట్ ఫైల్) : కాంగ్రెస్ ప్రభుత్వం గతంలో ప్రకటించిన నామినేటెడ్ పోస్టులపై నెలకొన్న ఉత్కంఠకు తెర పడింది. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న పలు కార్పొరేషన్ చైర్మన్ల నియామకాలకు తెలంగాణ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

కాగా ఈ ఏడాది మార్చి 16న 37 మందికి వివిధ శాఖల్లో చైర్మన్లుగా ప్రకటిస్తూ సీఎంవో వర్గాలు ఓ నోట్ రిలీజ్ చేశాయి. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఈ నియామకాలకు బ్రేక్ పడగా.. తాజాగా విడుదలైన నియామక ఉత్తర్వులతో కాంగ్రెస్ నేతల్లో సంతోషం నెలకొంది. తాజాగా విడుదలైన జీవో ప్రకారం తెలంగాణ రాష్ట్రంలోని 35 కార్పోరేషన్లకు కొత్త చైర్మన్లను నియమించనున్నారు.

కార్పొరేషన్లకు చైర్మన్లు వీళ్లే..

☞ఎండీ రియాజ్: తెలంగాణ స్టేట్ గ్రంథాలయ పరిషత్

☞పోడెం వీరయ్య: తెలంగాణ స్టేట్ ఫారెస్ట్ డెవలప్మెంట్

☞కాల్ప సుజాత: తెలంగాణ స్టేట్ అరవైశ్య కార్పోరేషన్

☞ఆర్ గురునాథ్ రెడ్డి: తెలంగాణ స్టేట్ హౌజింగ్ కార్పోరేషన్

☞ఎన్ గిరిధర్ రెడ్డి: తెలంగాణ స్టేట్ ఎంప్లాయిమెంట్ ప్రమోషన్ ట్రైనింగ్ ఇన్ ట్విన్ సిటీస్

☞జనక్ ప్రసాద్: తెలంగాణ స్టేట్ మినిమమ్ వేజస్ అడ్వైజరి బోర్డ్

☞ఎం విజయ బాబు: తెలంగాణ స్టేట్ ఇరిగేషన్ డెవలప్మెంట్ కార్పోరేషన్

☞చల్లా నరసింహ రెడ్డి: తెలంగాణ రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కో-ఆపరేషన్ లిమిటెడ్

☞కె. నరేందర్ రెడ్డి: శాతవాహన అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ

☞ఇ.వెంకట్రామి రెడ్డి: కాకతీయ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ

☞రాంరెడ్డి మల్రెడ్డి: తెలంగాణ రాష్ట్ర రోడ్డు అభివృద్ధి సంస్థ

☞జబ్బార్: తెలంగాణ రాష్ట్ర మైనారిటీస్ :

☞నాయుడు సత్యనారాయణ : తెలంగాణ రాష్ట్ర హస్తకళల అభివృద్ధి కార్పొరేషన్ లిమిటెడ్

☞అనిల్ ఎరావత్: తెలంగాణ స్టేట్ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్

☞నిర్మల జగ్గారెడ్డి: తెలంగాణ రాష్ట్ర పారిశ్రామిక మౌలిక సదుపాయాలు కార్పొరేషన్ లిమిటెడ్

☞ఐతా ప్రకాష్ రెడ్డి: తెలంగాణ స్టేట్ ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్

☞మన్నె సతీష్ కుమార్ : తెలంగాణ రాష్ట్ర సాంకేతిక సేవల అభివృద్ధి కార్పొరేషన్ లిమిటెడ్

☞తెలంగాణ స్టేట్ షెడ్యూల్ క్యాస్ట్ కో ఆపరేటివ్ డెవలప్ మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ చైర్మన్ గా ఎన్.ప్రీతమ్

☞తెలంగాణ స్టేట్ బీసీ కో ఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ లిమిటెడ్ చైర్మన్ గా నూతి శ్రీకాంత్

☞తెలంగాణ స్టేట్ షెడ్యూల్డ్ ట్రైబల్ కో ఆపరేటివ్ ఫైనాన్స్ డెవలప్ మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ చైర్మన్ గా బెల్లయ్య నాయక్

☞తెలంగాణ స్టేట్ గిరిజన కో ఆపరేటివ్ ఫైనాన్స్ డెవలప్ మెంట్ కార్పొరేషన్ చైర్మన్ గా కె.తిరుపతి

☞మోస్ట్ బ్యాక్వార్డ్ క్లాసెస్ డెవలప్ మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ చైర్మన్ గా జె.జైపాల్

☞తెలంగాణ స్టేట్ టూరిజం డెవలప్ మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ చైర్మన్ గా పలేల్ రమేశ్ రెడ్డి.

☞తెలంగాణ ఫుడ్ కార్పొరేషన్ చైర్మన్ గా ఎం.ఏ.ఫహీం

☞తెలంగాణ స్టేట్ ఉమెన్స్ కో ఆపరేటివ్ డెవలప్ మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ చైర్మన్ గా బంద్రు శోభారాణి

☞తెలంగాణ స్టేట్ వికలాంగుల కో ఆపరేటివ్ డెవలప్ మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ చైర్మన్ గా ఎం.వీరయ్య

☞తెలంగాణ స్టేట్ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ గా కె.శివ సేనారెడ్డి.

☞తెలంగాణ సంగీత నాట్య అకాడమీ చైర్మన్ గా అలేఖ్య పుంజల.

☞తెలంగాణ రాష్ట్ర విత్తనాల అభివృద్ధి సంస్థ చైర్మన్ గా ఎస్. అన్వేష్ రెడ్డి

☞తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ పరిశ్రమల అభివృద్ధి చైర్మన్ గా. కాసుల బాలరాజు

☞తెలంగాణ రాష్ట్ర సహకార ఆయిల్ సీడ్స్ ఉత్పత్తిదారుల చైర్మన్ గా జంగా రాఘవరెడ్డి

☞తెలంగాణ స్టేట్ కో-ఆపరేటివ్ యూనియన్ లిమిటెడ్ చైర్మన్ గా మనాల మోహన్ రెడ్డి

☞తెలంగాణ స్టేట్ వేర్‌హౌసింగ్ కార్పొరేషన్ లిమిటెడ్ చైర్మన్ గా రాయల నాగేశ్వరావు రావు

☞తెలంగాణ రాష్ట్ర ముదిరాజ్ కో-ఆపరేటివ్ సొసైటీ చైర్మన్ గా జ్ఞానేశ్వర్ ముదిరాజ్

☞తెలంగాణ రాష్ట్ర మత్స్య సహకార సంఘ చైర్మన్ గా మెట్టు సాయి కుమార్

విశ్వాస పరీక్షలో నెగ్గిన సీఎం.. కేబినెట్ విస్తరణకు రంగం సిద్ధం

ఝార్ఖండ్ : ఝార్ఖండ్ అసెంబ్లీలో నిర్వహించిన బల పరీక్షలో జేఎంఎం నేత, ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ నెగ్గారు. సోమవారం ఝార్ఖండ్ అసెంబ్లీలో స్పీకర్ రవీంద్రనాథ్ మెహతో సమక్షంలో ఈ బల పరీక్షను నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం హేమంత్ సోరెన్‌కు అనుకూలంగా 45 మంది ఎమ్మెల్యేలు ఓటు వేశారు. దాంతో ఈ విశ్వాస పరీక్షలో సీఎం హేమంత్ నెగ్గారు. అయితే సీఎం హేమంత్ సోరెన్.. తన కేబినెట్‌ను విస్తరించే అవకాశముందని సమాచారం.

ఈ ఏడాది జనవరి 31వ తేదీన భూ కుంభకోణంలో.. మని లాండరింగ్ వ్యవహారంలో సీఎం హేమంత్ సోరెన్‌ను ఈడీ అరెస్ట్ చేసిన సంగతి తెలిసిందే. అయితే తనకు మధ్యంతర బెయిల్ కోసం పలుమార్లు ఆయన కోర్టులను ఆశ్రయించారు. చివరకు లోక్ సభ ఎన్నికల్లో ప్రచారం చేసుకోవాలంటూ ఆయన కోర్టుల్లో పిటిషన్ దాఖలు చేసినా.. హేమంత్ సోరెన్‌కు బెయిల్ మంజురు కాలేదు.

ఆర్మీ వాహనాలపై టెర్రరిస్టుల దాడి.. రెండ్రోజుల్లో ఇది రెండోసారి

జమ్మూకశ్మీర్ : కతువా జిల్లా భర్నోటా గ్రామంలో మరోసారి టెర్రరిస్టులు కాల్పులకు తెగబడ్డారు. ఇండియన్ ఆర్మీ వాహనాలను లక్ష్యంగా చేసుకుని సోమవారం నాడు కాల్పులు జరపడంతో భద్రతా బలగాలు సమర్ధవంతంగా తిప్పికొట్టాయి. తొలుత గ్రనేడ్ విసిరిన టెర్రరిస్టులు ఆ తర్వాత కాల్పులు జరిపిట్టు చెబుతున్నారు. బిల్లావార్ తహసిల్‌లోని లోహైమల్హార్ బ్లాక్ మచ్చేడి ప్రాంతంలో ఈ దాడి ఘటన జరిగింది. వెంటనే అదనపు బలగాలు ఘటనా స్థలికి చేరుకుని ఆ ప్రాంతాన్ని తమ అధీనంలోకి తీసుకున్నాయి. ఉగ్రవాదుల కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నట్టు అధికారులు తెలిపారు. కుల్గాం జిల్లాలో భద్రతా బలగాలపై టెర్రరిస్టులు దాడి జరపడం గత రెండ్రోజుల్లో ఇది రెండవది. దీనికి ముందు కుల్గాం జిల్లాలో జరిగిన రెండు వేర్వేరు ఎన్‌కౌంటర్లపై ఆరుగురు టెర్రరిస్టులను ఆర్మీ మట్టుబెట్టింది.

ముంబయిలో భారీ వర్షాలు.. 50పైగా విమానాలు రద్దు..!

ముంబయి: ముంబయిలో భారీ వర్షాలు కురుస్తున్నాయి. వానలకు రోడ్లపై వరద పోటెత్తుతున్నది. ఫలితంగా ట్రాఫిక్ జామవుతున్నది. అదే సమయంలో వర్షాల కారణంగా రైళ్ల రాకపోకలకు సైతం తీవ్రంగా అంతరాయం కలుగుతున్నది. వానల కారణంగా పాఠశాలలు, కళాశాలలకు సెలవులు ప్రకటించారు. ఆదివారం అర్ధరాత్రి నుంచి కుండపోత వర్షం కురుస్తున్నది. అర్ధరాత్రి ఒంటి గంట నుంచి ఉదయం 7 గంటల వరకు పలుచోట్ల 300 మిల్లీమీటర్లకు పైగా వర్షం నమోదైంది. భారీ వర్షాల కారణంగా ముంబైలోని లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. దాదర్ అతలాకుతలమైంది. ఇక్కడ రోడ్లపై నుంచి రైలు పట్టాల వంకు నీరు నిండిపోయింది. కార్లు రోడ్లపై నీటిలో తేలియాడుతున్నాయి. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలకు బృహన్ ముంబయి మున్సిపల్ కార్పొరేషన్ సెలవు ప్రకటించింది.

భారీ వర్షాలతో వెలుతురు లేని కారణంగా ఛత్రపతి శివాజీ మహారాజ్ అంతర్జాతీయ విమానాశ్రయం మధ్యాహ్నం 2.22 నుంచి 3.40 గంటల వరకు రన్‌వే కార్యకలాపాలను నిలిపివేసింది. దాంతో 50పైగా విమానాలను రద్దు చేయడంతో పాటు ఆయా విమానాలను అహ్మదాబాద్, హైదరాబాద్, ఇండోర్‌కు మళ్లించారు. ఇదిలా ఉండగా.. వరద పరిస్థితిని సమీక్షించేందుకు మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే డిజాస్టర్ కంట్రోల్ రూమ్‌లో ఉన్నత స్థాయి సమావేశం నిర్వహించారు. ముంబయి గార్డియన్ మంత్రి ఎంపీ లోధా, రిలీఫ్ అండ్ రిహాబిలిటేషన్ మంత్రి అనిల్ పాటిల్ సైతం హాజరయ్యారు. సమావేశంలో సీఎం షిండే మాట్లాడుతూ నిన్న రాత్రి నుంచి ముంబయిలో 300 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైందని తెలిపారు. వర్షం నీటిని తోడేందుకు 200 నీటి పంపులు, 400 బీఎంసీ పంపులు పని చేశాయని.. సెంట్రల్, హార్బర్ లైన్లలో రైళ్లు తిరిగి ప్రారంభమైనట్లు తెలిపారు.

'నేను సైనికుడిని' అంటూ.. కేంద్రానికి రాహుల్ గాంధీ డిమాండ్

ఢిల్లీ : కాంగ్రెస్ ఎంపీ, విపక్ష నేత రాహుల్ గాంధీ సోమవారం మణిపూర్‌కి వెళ్లడానికి ముందు అస్సాంలోని) కాచార్ జిల్లాలో వరద బాధితుల్ని కలుసుకున్నారు. ఫులెర్తాల్ వద్ద వరద సహాయక శిబిరాన్ని సందర్శించి.. బాధితులకు తన సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా.. పార్లమెంటులో మీ ప్రతినిధినంటూ తన నిబద్ధతను నొక్కి చెప్పారు. వరదలతో దెబ్బతిన్న రాష్ట్రానికి సమగ్ర సహాయాన్ని త్వరగా అందించాలని కేంద్ర ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. "నేను అస్సాం ప్రజలకు అండగా ఉన్నాను. పార్లమెంటులో నేను వారి సైనికుడిని. వరదలతో దెబ్బతిన్న ఆ రాష్ట్రానికి అన్ని విధాలుగా సహాయం, మద్దతు అందించాలని నేను కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతున్నాను" అంటూ రాహుల్ గాంధీ ఎక్స్ వేదికగా ట్వీట్ చేశారు. అస్సాంలో వరదల తీవ్ర ప్రభావాన్ని ఎత్తిచూపుతూ.. సహాయం, పునరావాసం, పరిహారంతో కూడిన తక్షణ అవసరాన్ని గాంధీ నొక్కి చెప్పారు. దీర్ఘకాలిక వరద నియంత్రణ చర్యలను పరిష్కరించేందుకు గాను.. పాన్-ఈశాన్య నీటి నిర్వహణ అథారిటీని ఏర్పాటు చేయాలని కోరారు. ఇదే సమయంలో.. అస్సాం కాంగ్రెస్ నేతలు రాహుల్ గాంధీకి క్షేత్ర పరిస్థితిని వివరించారు. ఈ వరదల కారణంగా 24 లక్షల మంది ప్రజలు ప్రభావితం అయ్యారని, 53,000 మందికి పైగా నిరాశ్రయులయ్యారని, 60 మందికి పైగా మరణించారని వెల్లడించారు. దీనిపై ఆయన స్పందిస్తూ.. "వరదలు లేని అస్సాంను తయారు చేస్తామని వాగ్దానం ఇచ్చిన బీజేపీ డబుల్ ఇంజిన్ ప్రభుత్వ నిర్వహణలోపాన్ని ఈ సంఖ్యలు ప్రతిబింబిస్తాయి" అని విరుచుకుపడ్డారు. అనంతరం.. రాష్ట్రవ్యాప్తంగా మృతుల కుటుంబాలకు సంతాపాన్ని తెలిపారు.

మరోవైపు.. రాహుల్ గాంధీ అస్సాం, మణిపూర్ పర్యటనలపై కాంగ్రెస్, బీజేపీ పార్టీల మధ్య నెట్టింట్లో మాటల యుద్ధం జరిగింది. మణిపూర్‌లో హింస చెలరేగినప్పటి నుంచి నాన్-బయోలాజికల్ ప్రధాని ఒక్కసారి కూడా అక్కడికి వెళ్లలేదని, కానీ రష్యాకు వెళ్లారని జైరాం రమేశ్ సెటైర్లు వేశారు. ఇందుకు బీజేపీ ఐటీ సెల్ చీఫ్ అమిత్ మాల్వియా బదులిస్తూ.. రాహుల్ 'సిక్ ట్రాజెడీ టూరిజం'లో మునిగారని.. మణిపూర్‌లో జరిగిన హింసాకాండ కాంగ్రెస్ వారసత్వమని ఆరోపణలు గుప్పించారు.

జాతీయ వార్తలు

కొత్త పన్ను విధానంలో మార్పులు

ఢిల్లీ : గత ఆర్థిక సంవత్సరానికి (2023-24)గాను ఆదాయ పన్ను రిటర్న్ (ఐటీఆర్)ల దాఖలుకున్న గడువు ఈ నెలాఖరే (జూలై 31). అయితే కొత్త పన్ను విధానంలో అనేక మార్పులొచ్చాయి. కాబట్టి వాటిని గుర్తుంచుకుంటే మంచిది.

2023-24 మొదలు కొత్త పన్ను విధానం డీఫాల్ట్ హోదాను అందుకున్నది. కనుక పన్ను మినహాయింపులను ఆశించే వేతన జీవులు వారి కంపెనీ యాజమాన్యాలకు పాత పన్ను విధానాన్ని కోరుకుంటున్నట్టు తెలియపర్చాలి. లేకపోతే కొత్త పన్ను విధానం పరిధిలో మీకు పన్ను రేట్లు వర్తిస్తాయి.

కొత్త విధానంలో రిబేటు పరిమితి రూ. 5 లక్షల నుంచి రూ. 7 లక్షలకు పెరిగింది. మీకు వార్షిక వేతనం రూ. 7.5 లక్షలున్నా పన్ను కట్టనక్కర్లేదు.

కొత్త పన్ను విధానాన్ని ఆకర్షణీయంగా మార్చేందుకు ఐటీ స్లాబులను 6 నుంచి 5కు తగ్గించారు. వార్షిక ఆదాయం రూ. 3 లక్షలదాకా పన్నుండదు. రూ. 3-6 లక్షల మధ్య 5%, రూ. 6-9 లక్షల మధ్య 10 %, రూ. 9-12 లక్షల మధ్య 15 %, రూ. 12-15 లక్షల మధ్య 20 %, రూ. 15 లక్షలు దాటితే 30 % పన్నుంటుంది.

బీజేపీ ఎంపీ విజయోత్సవ సభలో మద్యం పంపిణీ

ఢిల్లీ : చిక్కబళ్లాపూర్ బీజేపీ ఎంపీ కే. సుధాకర్ లోక్‌సభ ఎన్నికల్లో తన గెలుపు సందర్భంగా పార్టీ కార్యకర్తలకు ఇచ్చిన విందులో బాహాటంగా మద్యం పంపిణీ చేయడం కలకలం రేపింది. పార్టీలో మద్యం తీసుకునేందుకు ప్రజలు క్యూలో నిలుచున్న వీడియో సోషల్ మీడియాలో ప్రస్తుతం తెగ వైరలవుతోంది. విజయోత్సవ సభలో మద్యం పంపకాలపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తాయి.

ఇది పోలీసుల వైఫల్యమని పలువురు ఆరోపిస్తుండగా ఈ ఘటనపై బెంగళూర్ రూరల్ ఎస్పీ సీకే బాబా స్పందించారు. ఎక్సైజ్ శాఖ ఈ కార్యక్రమానికి అనుమతి ఇచ్చిందని, ఏర్పాట్లను సజావుగా చేపట్టాలని పోలీసులను కోరారని చెప్పారు. ఈ ఘటన విషయంలో పోలీస్ శాఖ తప్పు లేదని, అనుమతి ఇచ్చే బాధ్యత ఎక్సైజ్ శాఖదేనని స్పష్టం చేశారు. బీజేపీ నేత మద్యం పంపిణీకి ఎక్సైజ్ శాఖ అనుమతి ఇస్తే, పోలీసులు శాంతిభద్రతలను కాపాడుతూ పహారా కాశారని ఈ ఘటనపై పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. లోక్‌సభ ఎన్నికల్లో గెలుపొందిన అనంతరం బీజేపీ నేతలను థ్యాంక్స్ గివింగ్ పార్టీలకు అనుమతించారా అని ప్రశ్నిస్తున్నారు.

సంక్షేమానికి చిరునామా వైఎస్ రాజశేఖర్ రెడ్డి

- వైసీపీ పొన్నూరు నియోజకవర్గ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ
- ఘనంగా వైఎస్ఆర్ జయంతి వేడుకలు

గుంటూరు, పెదకాకాని (జర్నలిస్ట్ ఫైల్):సంక్షేమానికి చిరునామా దివంగత నేత వైయస్ రాజశేఖర రెడ్డి అని వైసీపీ పొన్నూరు నియోజకవర్గ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ అన్నారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి 75వ,జయంతి వేడుకలు సోమవారం మండల వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు..ఇందులో భాగంగా పెదకాకాని సెంటర్లో ఉన్న వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. అనంతరం నాయకులు, కార్యకర్తలు ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా సమన్వయకర్త అంబటి మాట్లాడుతూ పేదవాడు గొప్పవాడు కావాలి రైతు రాజు కావాలి అని అనుకొన్న గొప్ప నాయకుడు దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి అని అన్నారు.. ఫీజు రీయింబర్స్‌మెంట్, ఆరోగ్యశ్రీ, 108, ఉచిత గృహాలు వంటి సంచలనాత్మకమైన సంక్షేమ పథకాలను అమలు చేసి అన్ని సామాజిక వర్గాలకు ముఖ్యమంత్రి స్థానంలో ఉండి న్యాయం చేసిన ఘనత దివంగత ముఖ్యమంత్రి వైఎస్ఆర్ కే చెందుతుందని అన్నారు. ప్రజాప్రస్థానం పేరిట రాష్ట్రవ్యాప్తంగా పాదయాత్ర నిర్వహించిన వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చారన్నారు.

వినూత్నమైన సంక్షేమ పథకాలకు హామీ ఇస్తూ ప్రజల మన్నలను పొందారని తెలిపారు. వ్యవసాయానికి ఉచిత విద్యుత్ ఇస్తామంటూ సంచలన హామీ ఇవ్వడమే గాక అధికారం చేపట్టిన తర్వాత ప్రమాణస్వీకారం చేసిన వేదికపైనే తొలిసంతకం చేసి అమలు చేసి చూపారని,గత బకాయిలను సైతం ఒక్క కలంపోటుతో రద్దు చేశారన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకంలో పేద విద్యార్థుల జీవితాల్లో వెలుగులు నింపారని తెలియజేశారు. లక్షలాదిమంది గ్రామీణ ప్రాంత విద్యార్థులు ఇంజినీర్లుగా జీవితంలో స్థిరపడ్డారంటే వైఎస్ఆర్ చలువే అనడంలో అతిశయోక్తి లేదన్నారు. ఆరోగ్యశ్రీ పథకంతో నిరుపేదలకు సైతం కార్పొరేట్ వైద్యాన్ని అందించి మహానేతగా ప్రజల్లో చిరస్థాయిగా నిలిచిపోయారాని అన్నారు. లక్షకోట్లతో జలయజ్ఞం పనులు చేపట్టి సాగునీటి ప్రాజెక్ట్‌లు పూర్తిచేసిన ఘనత వైఎస్ఆర్‌కే దక్కుతుందన్నారు. పారిశ్రామికంగానూ రాష్ట్రాన్ని ముందంజలో నింపారని, పోర్టుల నిర్మాణం,ప్రత్యేక ఆర్థిక మండళ్ల ఏర్పాటుతో పరిశ్రమలకు పెద్దపీట వేశారని పేర్కొన్నారు..రాజకీయాల్లో వైయస్సార్ లాంటి నాయకుడిని చూడలేమని.. ఆయన లేని లోటును ఆయన తనయుడు వైయస్ జగన్ భర్తీ చేస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో సర్పంచులు గోళ్ళ స్వరూప రాణి, శివ కృష్ణారెడ్డి, ఎంపీటీసీలు, నియోజకవర్గ,మండల, గ్రామ వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

గుంటూరు,పెదకాకాని(జర్నలిస్ట్ ఫైల్): పెదకాకాని మండల కాంగ్రెస్ ఆధ్వర్యంలో సోమవారం దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి 75వ, జయంతిని పురస్కరించుకొని పెదకాకాని లూథరగిరిలో వైస్సార్ విగ్రహానికి పూలమాల వేసి ఘననివాళీలు ఆర్పిచ్చారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షులు కంతేటి యలమందరావు మాట్లాడుతూ వైయస్ రాజశేఖర్ రెడ్డి ఉమ్మడి తెలుగు రాష్ట్ర ప్రజలకు ఆరు సంవత్సరాలు సుస్థిర ప్రజా పాలన అందించారన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు జొన్నల వెంకటరెడ్డి. అగతవరపాడు మాజీ సర్పంచ్ తుమ్మ చిన్న పోల్ రెడ్డి. కండెల నాగరాజు. ఎస్.కె మొహిద్దిన్ భాష. బట్టు మనోజ్.బత్తుల దాసు. బట్టు దిలీప్,కండెల రాజరత్నం. బెజ్జం రాజేష్ పాల్గొన్నారు.

ఇసుక ఉచితం పై హర్షం

గుంటూరు, పెదకాకాని (జర్నలిస్ట్ ఫైల్): ఆంధ్రప్రదేశ్ భవన నిర్మాణ కార్మిక సంఘం ఎఐటియుసి ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం ఉచిత ఇసుక పాలసీ ప్రవేశపెట్టడాన్ని పురస్కరించుకొని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం కొణిదల పవన్ కళ్యాణ్ లకు అభినందనలు తెలియజేసి, హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న రాష్ట్ర భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షులు పుప్పాల సత్యనారాయణ (బుజ్జి) మాట్లాడుతూ ఎన్నికల సందర్భంగా సీఎం చంద్రబాబు నాయుడు,డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును ఏర్పాటు చేస్తామని మాట ఇచ్చారని తెలిపారు. మేనిఫెస్టోలో పెట్టి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత భవన నిర్మాణ కార్మికుల కొరకు ఇసుక ఉచితంగా ఇవ్వటం వలన హర్షం వ్యక్తం చేశారు. భవన నిర్మాణ కార్మిక రంగంలో పనిచేస్తున్న 32 రకాల పనివార్లకు చేతినిండా పనులు ఉంటాయని,తద్వారా ఆర్థిక ఇబ్బందులు లేకుండా పోతాయని ఆనందం వ్యక్తం చేశారు. సంక్షేమ బోర్డును పునరుద్ధరించి పెండింగ్లో ఉన్న 42 వేల క్లెములకు నిధులు మంజూరు చేసి కార్మికులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మునగ కోటేశ్వరరావు,బొట్టు శ్రీనివాసులు,కట్టేబోయిన శ్రీనివాసరావు,ఆర్దల అంకబాబు,రఫీ తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర శిక్ష ఉద్యోగుల జీతాలు చెల్లించండి : మంత్రి నారా లోకేష్ కు ఆప్టా వినతి

అమరావతి (జర్నలిస్ట్ ఫైల్): గత రెండు నెలలుగా జీతాలు లేక ఇబ్బంది పడుతున్న సమగ్ర శిక్ష ఉద్యోగులకు తక్షణమే జీతాలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేష్ కు ఆంధ్రప్రదేశ్ ప్రైమరీ టీచర్స్ అసోసియేషన్ (ఆప్టా) రాష్ట్ర అధ్యక్షులు ఏ జి ఎస్ గణపతిరావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ప్రకాష్ రావు పత్రికాముఖంగా విజ్ఞప్తి చేశారు.,

సమగ్ర శిక్ష ఉద్యోగులైనటువంటి కస్తూరిబా గాంధీ విద్యాలయాల్లో పనిచేస్తున్న బోధన మరియు బోధనేతర సిబ్బందికి, భవిత స్కూల్లో పనిచేస్తున్న ఐ ఈ ఆర్ టి లకు, జిల్లా పరిషత్ పాఠశాలల్లో పని చేస్తున్న పార్ట్ టైం ఇన్స్ట్రక్టర్ లు అయినటువంటి, ఆర్ట్, క్రాఫ్ట్,డ్రాయింగ్, పిడి లకు, మండల కార్యాలయాల్లో పనిచేస్తున్న సి ఆర్ పి లు ,ఎం ఐ ఎస్ కోఆర్డినేటర్లు, ఎల్ డి ఏ లు, మరియు మెసెంజర్లు మీరే కాకుండా డిఇఓ కార్యాలయంలో పనిచేస్తున్నటువంటి ఎస్ ఎస్ ఏ సిబ్బందికి గత రెండు నెలలుగా జీతాలు అందక చాలా ఇబ్బంది పడుతున్నారని కావున వారికి వెంటనే జీతాలు చెల్లించాలని సర్వ శిక్ష స్టేట్ ప్రాజెక్ట్ డైరెక్టరును ఆప్టా రాష్ట్ర అధ్యక్షులు గణపతి రావు ఫోన్ ద్వారా సంప్రదించగా వారు మానవుల శాఖ మంత్రి దృష్టిలో ఈ విషయం పెట్టడం జరిగిందని చెప్పి ఉన్నార. కావున మానవ వనరుల శాఖ మంత్రి లోకేష్ బాబు మానవతా దృక్పథంతో వెంటనే వీరికి జీతాలు అందించేలా తగు చర్యలు గైకొనాలని ఆప్టా సంఘం తరఫున ప్రకాష్ రావు విజ్ఞప్తి చేశారు. అలాగే గత డిసెంబర్లో 22రోజులు సమ్మెలో పాల్గొన్నటువంటి సమగ్ర శిక్ష ఉద్యోగులకు ఆ సమ్మె కాలానికి జీతాన్ని కూడా చెల్లించాలని వారు పత్రికాముఖంగా కోరారు.

చంద్రబాబు సీఎం కావాలని మొక్కుకున్నాం: దేవేంద్ర

విజయవాడ (జర్నలిస్ట్ ఫైల్): విజయవాడ రూరల్ పి. నైనవరం, నున్న నుంచి వేళంకిణికి 70 మంది గ్రామస్తులు పయనమయ్యారు. ఏపీలో కూటమి ప్రభుత్వం వస్తే వేళంకిణికి వస్తావని మొక్కుకున్నామని నైనవరం గ్రామస్తులు తెలిపారు. తమ కోరిక నెరవేరిందని, టీడీపీ నాయకుడు దేవేంద్ర ఆధ్వర్యంలో 70 మంది నైనవరం గ్రామస్తులు వేళంకిణికి బయలుదేరి వెళ్లారు. ఈ సందర్భంగా దేవేంద్ర మాట్లాడుతూ.. నారా చంద్రబాబు నాయుడు సీఎంగా ప్రమాణ స్వీకారం చేయాలని వేళంకిణి మాతకు మొక్కుకున్నామని, అలాగే యార్లగడ్డ వెంకట్రావు భారీ మెజారిటీతో విజయం సాధించాలని గ్రామస్తులు ముక్కురని చెప్పారు. తమ కోరిక నెరవేరిన క్రమంలో గ్రామస్తులు అందరం కలిసి ముందు కాశీ వెళ్ళామని, ఎప్పుడు 70 మందితో కలిసి వేళంకిణికి బయలుదేరి వెళుతున్నామని దేవేంద్ర తెలిపారు.

ఏపీ టెట్ షెడ్యూల్‌లో మార్పులు

అమరావతి(జర్నలిస్ట్ ఫైల్): ఉపాధ్యాయ అర్హత పరీక్ష(టెట్) షెడ్యూల్‌లో కీలక మార్పులు చేస్తూ నోటిఫికేషన్ విడుదలయ్యింది. ఈ నెల 4వ తేదీ నుంచి టెట్ దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభమైన సంగతి విదితమే. రాష్ట్రంలో 16,347 టీచర్ పోస్టుల భర్తీకిగాను మెగా డీఎస్సీకి సన్నద్ధమైన ఎపి ప్రభుత్వం మరోసారి టెట్ నిర్వహిస్తుంది. జులై 2న టెట్ నోటిఫికేషన్ విడుదల చేసినప్పటికీ అభ్యర్థుల విజ్ఞప్తి మేరకు టెట్, డీఎస్సీలకు రెడీ అవ్వడానికి మరింత గడువును పొడిగిస్తూ టెట్ షెడ్యూల్‌లో పలు మార్పులతో నోటిఫికేషన్ విడుదల చేసింది. పాత నోటిఫికేషన్ ప్రకారం ఆగస్టు 5 నుంచి 20 వరకు టెట్ పరీక్షలు జరగాల్సి ఉండగా.. వాటిని అక్టోబర్ 3 నుంచి 20వరకు నిర్వహించాలని మార్పు చేస్తూ నోటిఫికేషన్‌ను విడుదల చేసింది.

30 లక్షలు ఇస్తామని ఆశచూపి కిడ్నీ కొట్టేసిన ముఠా..

- గుంటూరులో భారీ మోసం

గుంటూరు జిల్లా క్రైం బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్) విజయవాడలో కిడ్నీ రాకెట్ కలకలం సృష్టించింది. కిడ్నీ దానం చేస్తే 30 లక్షలు ఇస్తామని ఆశచూపి గుంటూరుకు చెందిన వ్యక్తిని ఓ ముఠా మోసం చేసింది. ఆపరేషన్ చేయించి కిడ్నీ తీసుకున్నాక.. డబ్బులు ఇచ్చేది లేదంటూ బెదిరించింది. దీంతో బాధితుడు గుంటూరు ఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదు చేశాడు.

వివరాల్లోకి వెళ్తే.. గుంటూరుకు చెందిన గార్లపాటి మధుబాబు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నాడు. అతనికి విజయవాడకు చెందిన బాషా అనే వ్యక్తి సోషల్‌మీడియాలో పరిచయమయ్యాడు. మధుబాబు అవసరాన్ని ఆసరాగా చేసుకున్న బాషా.. కిడ్నీదానం చేస్తే రూ. 30లక్షలు ఇప్పిస్తానని నమ్మబలికాడు. 30లక్షల డబ్బు వస్తే తన సమస్యలు అన్నీ తీరుతాయని ఆశపడిన మధుబాబు కిడ్నీ విక్రయానికి ఒప్పుకున్నాడు.

మధుబాబు ఒప్పుకోవడంతో ఈ నెల మొదటి వారంలో విజయవాడలోని విజయ హాస్పిటల్‌కు తీసుకెళ్లి ఆపరేషన్ చేయించి కిడ్నీ తీసుకున్నారు. ఆపరేషన్ తర్వాత మధు బాబుకు 30 లక్షలు ఇవ్వాల్సి ఉండగా.. కేవలం 1.10 లక్షలు మాత్రమే బాషా ఇచ్చాడు. మిగిలిన డబ్బులు అడిగేసరికి బాషా తన నిజస్వరూపం బయటపెట్టాడు. స్నేహితుడిలా కిడ్నీ దానం చేసినట్లు సంతకం చేశావని మధుబాబుకు తెలిపాడు. కాబట్టి నీకు మిగిలిన డబ్బు ఇవ్వాల్సిన అవసరం లేదంటూ బెదిరించాడు. దీంతో మోసపోయానని గ్రహించిన బాధితుడు పోలీసులను ఆశ్రయించాడు. డాక్టర్ శరత్‌బాబు, మధ్యవర్తి బాషాపై గుంటూరు జిల్లా ఎస్పీకి ఫిర్యాదుచేశాడు.

అంటువ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

- సహాయమలేరియాఅధికారి చిరసానిప్రభాకరరెడ్డి

తెనాలి జర్నలిస్ట్ ఫైల్ : డెంగ్యూ మాసోత్సవం సందర్భంగా తెనాలి రామలింగేశ్వరపేటలోని మమత నర్సింగ్ స్కూల్ విద్యార్థినిలకు జిల్లామలేరియా అధికారి శ్రీ తలాటం మురళీకృష్ణ సుబ్బరాయణం మౌఖిక ఆదేశాల ప్రకారం డెంగ్యూ ,డయేరియాల వ్యాధులపై అవగాహన కలిగించినట్లు సహాయ మలేరియా అధికారి చిరసాని ప్రభాకరరెడ్డి తెలిపారు. డెంగ్యూ వ్యాధి ఏడిస్ అనే దోమ కాటు వలన ఒకరి నుండి మరొకరికి వ్యాప్తి చెందుతుందని, ఈ దోమ వర్షపు నీరు,మంచినీటి నిల్వలలో గుడ్లు పెట్టి తమ సంతతిని అభివృద్ధి చేసుకుంటుందని, కావున వం-ష్పునీరు, ఇంటి లోపల ఫ్రిజ్, పూల కుండీలోను నీటిని వారమునకు ఒకసారి తప్పనిసరిగా మార్చుకొనవలెనని తెలిపారు. దోమల వలన మలేరియా, ఫైలేరియా, చికెన్ గునియా, డెంగ్యూ ,జికా ,మెదడువాపు వ్యాధులు వస్తాయని ఆరోగ్య విస్తరణాధికారి అందె బాలచంద్రమౌళి తెలిపారు. క్యూలెక్స్ దోమ వలన పైలేరియా వ్యాధి వస్తుందని ఈ దోమ మురుగునీటి నిల్వలలో తమ సంతతిని అభివృద్ధి చేసుకుంటుందని సీనియర్ హెల్త్ ఇన్స్పెక్టర్ గుద్దంటి రవికుమార్ తెలిపారు. కలుషితమైన నీరు ఆహారం తీసుకొనుట వలన అపరిశుభ్రమైన చేతుల వలన డయేరియా గురవుతారని చిన్నపిల్లలలో ఎక్కువగా ఆడుకుంటూ మురికి చేతులతో ఆహారము తీసు కొనుట వలన ఈ వ్యాధి వస్తుందని తెలిపారు. కావున కాచి చల్లార్చిన నీటిని త్రాగాలని వేడి,వేడి ఆహార పదార్థాలు తీసుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మమత స్కూల్ ఆఫ్ నర్సింగ్ ప్రిన్సిపల్ టి రమేష్ , టీచింగ్ ఫ్యాకల్టీ ఎం సంధ్య, రాజ్యలక్ష్మి,నాగలక్ష్మి,హెల్త్ సూపర్వైజర్స్ దీపాల శ్రీనివాసరావు బండారు మల్లేశ్వరరావు,తిరువీధుల రాంప్రసాద్, హెల్త్ అసిస్టెంట్ షేక్ నవీద్, షేక్ రషీద్ ,మున్నంగి రత్నాకరరావు తదితరులు పాల్గొన్నారు.

జగన్ మంచి చేసినా ఎలా ఓడిపోయారు

- మాజీ డిప్యూటీ సీఎం నారాయణ స్వామి

చిత్తూరు (జర్నలిస్ట్ ఫైల్): ప్రధాని నరేంద్ర మోదీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుపై మాజీ డిప్యూటీ సీఎం నారాయణ స్వామి వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. జగన్ మంచి చేసినా ఎలా ఓడిపోయారు అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయన్నారు. ఎన్నికలు ఎలా జరిగాయో.. ఎలా టాపరింగ్ జరిగిందో.. కూటమి పార్టీ ఎలా గెలిచిందో అనేది దేశమంతా కోడై కూస్తోందన్నారు. అన్ని విషయాలు త్వరలోనే బయటపడతా యని అన్నారు. తప్పు చేస్తే తనను అయినా సరే జైల్లో పెట్టి నిలదీయాలని.. అంతేకానీ వైసీపీకి ఓట్లు వేశారన్న పేదలపై కక్ష కట్టొద్దన్నారు.

వైసీపీ నుంచి పోటీ చేసిన ఎమ్మెల్యే, ఎంపీలను ఇతర లీడర్లను కాల్చి పడేయాలని.. ఇలా చేస్తే భవిష్యత్తులో వారికి ఎదురే ఉండదని.. ఇష్టం వచ్చినట్లు దేశంలోనూ, రాష్ట్రంలోనూ పాలించుకోవచ్చంటూ ఫైర్ అయ్యారు. ఈ ప్రజాస్వామ్య దేశంలో ఎవరైనా పోటీ చేయవచ్చని.. ఎవరైనా ఎవరికైనా ఓటు వేయవచ్చన్నారు. అంతమాత్రాన టీడీపీకి ఓటు వేయలేదనే నేపంతో గ్రామాల్లో ఆందోళనలు సృష్టించి దాడి చేసి ఇల్లును ధ్వంసం చేయడం చూస్తుంటే ప్రధానమంత్రికి, ముఖ్యమంత్రికి పేదవారు ఓటు వేయడమే శాపంగా మారినట్లుందన్నారు. "ఇటీవల జరిగిన ఎన్నికల్లో మీరు ఎలా గెలిచారో దేశ ప్రజలందరికీ తెలుసు. ఇకనైనా ఉమ్మడి రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహాలుపై దాడిని ఆపండి. ప్రజాస్వామ్యాన్ని కాపాడండి. గ్రామాల్లో వైఎస్ఆర్సీపీ సానుభూతిపరులపై దాడి చేస్తుంటే పోలీసులు ప్రేక్షక పాత్ర పోషిస్తున్నారు" అంటూ మాజీ డిప్యూటీ సీఎం నారాయణ స్వామి ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఎంఈఓ 2 కి కొత్త జాబ్ చార్ట్ ఇవ్వాలి.

- వీరిని మండల పరిషత్ విద్యాశాఖ అధికారిగా పేరు మార్చాలి.
- మండల పరిషత్ లో పనిచేసే ఎస్ జి టి , స్కూల్ అసిస్టెంట్ ల జీతాలు చెల్లింపు మరియు ఇతర అన్ని అధికారాలు ఎంఈఓ 2 కే ఇవ్వాలి
- నవ్యాంధ్ర టీచర్స్ అసోసియేషన్

అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) : రాష్ట్రంలో పనిచేసే మండల విద్యాశాఖ అధికారి 2 పోస్ట్ కు మండల పరిషత్ విద్యాశాఖ అధికారిగా పేరు మార్చి మండల పరిషత్ పాఠశాలలో మండల పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాథమిక ఉన్నత పాఠశాలలో పనిచేసే ఉపాధ్యాయుల జీతాల చెల్లింపు అధికారాలు మరియు తనిఖీ అధికారాలు మరియు శాఖ పరమైన అన్ని అధికారాలను ఎంఈఓ 2 కు బదలాయించాలని నవ్యాంధ్ర టీచర్స్ అసోసియేషన్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కరణం హరికృష్ణ మరియు శ్రీనివాస్ రావు ఒక ప్రకటనలో ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

వీరికి ప్రత్యేకమైన ఆఫీసును ప్రతి మండలంలో ఏర్పాటు చేయాలని ఆ ఆఫీస్ లో పనిచేయడానికి కావలసిన సిబ్బందిని కూడా నియమించాలని తద్వారా ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడానికి ఉపాధ్యాయులకు తగిన సూచనలు ఇవ్వటానికి విద్యావ్యవస్థలో ఉన్న లోపాలను సరిదిద్దటానికి అవకాశం ఉంటుందని తెలియజేశారు. పంచాయతీరాజ్ వ్యవస్థలో పనిచేసే ఉపాధ్యాయులకు పదోన్నతులకు తొలిమెట్టుగా వీటిని చూడాలని ఎంఈఓ 2 మరియు ప్రధానోపాధ్యాయులలో సీనియర్లకు డిప్యూటీ విద్యాశాఖ అధికారుల పోస్టులకు పదోన్నతి కల్పించాలని విజ్ఞప్తి చేశారు. పర్యవేక్షణ అధికారుల కొరత వలన విద్యవ్యవస్థ కుంటుపడినందున గత ప్రభుత్వం ఇచ్చిన ఎంఈఓ 2 పోస్టులు సరైన క్రమంలో ఉపయోగించుకోవడం ద్వారా ప్రాథమిక విద్యా వ్యవస్థను బలోపేతం చేయటానికి ఇది ఒక అవకాశం గా ప్రభుత్వం భావించాలని కోరారు.

వ్యాయామ విద్య కోర్సుల ఫలితాలు విడుదల

గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్): ఆంధ్రప్రదేశ్ లో వ్యాయామ విద్య కోర్సులైన బీపీఇడి, యూజీడీపీఇడి కోర్సుల ప్రవేశాలకు నిర్వహించిన ఆంధ్రప్రదేశ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ 2024 ఫలితాలను సోమవారం ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ తాత్కాలిక రిజిస్ట్రార్ ప్రొఫెసర్ సంధ్య కోల్ విడుదల చేశారు. ఈ సందర్భంగా పీసెట్ కన్వీనర్ ప్రొఫెసర్ పి. జాన్సన్ మాట్లాడుతూ %% జూన్ 24 నుంచి 27 వరకు విశ్వవిద్యాలయం క్యాంపస్ లో నిర్వహించిన పీ సెట్ పరీక్షల ఫలితాలు విడుదల చేశామని తెలిపారు. ఈ పరీక్షకు 1641 మంది దరఖాస్తు చేసుకోగా, 1124 మంది హాజరయ్యారని వారిలో 784 మంది పురుషులు, 340 మంది మహిళ అభ్యర్థులు పరీక్షలకు వచ్చినట్లు అన్నారు. వారిలో 1064 మంది 95.11 శాతం అర్హత సాధించినట్లు చెప్పారు. అభ్యర్థులు ఏపీ పీ సెట్ వెబ్ సైట్ నుంచి ర్యాంక్ కార్డులను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు అని సూచించారు. ఉన్నత విద్యామండలి ఆదేశానుసారం త్వరలో ప్రవేశాల వివరాలు వెల్లడిస్తామని ప్రొఫెసర్ జాన్సన్ వివరించారు. ఈ కార్యక్రమంలో పూర్వ పీసెట్ కన్వీనర్ డాక్టర్ డి. సూర్యనారాయణ, వ్యాయామ విద్య విభాగం సిబ్బంది పాల్గొన్నారు.

రుయాలో నర్స్‌పై రోగి దాడి

తిరుపతి (జర్నలిస్ట్ ఫైల్): రుయాలో నర్స్‌పై మానసిక రోగి దాడి చేశాడు. ఇనుప స్టాండ్‌తో తలపై కొట్టడంతో నర్స్‌కు తీవ్ర గాయమైంది. దీంతో ఆమెను ఎమర్జెన్సీ వార్డ్‌కి తరలించి చికిత్స అందిస్తున్నారు. ప్రస్తుతం రుయా కార్డియాలజీ విభాగంలో చికిత్స పొందుతుంది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటనకు వ్యతిరేకంగా రుయా వద్ద నర్సింగ్ సిబ్బంది ధర్నాకు దిగారు.

జర్నలిస్ట్ ఫైల్
మీరు చందాదారులుగా చేరాలనుకుంటున్నారా.. సకాలంలో పేపరు అందడం లేదా.. సంప్రదించండి - 7661805968
అతితక్కువ ఖర్చుతో పుట్టినరోజు, వివాహ వేడుక, పదవీ విరమణ, ప్రారంభోత్సవం, శ్రద్ధాంజలి, పేరుమార్పు, లీగల్ ప్రకటనలకు... సంప్రదించండి - 7416812467

Edited, Printed and Published by D.Ajay at Express Printers and Publishers D.No. 3-28-1, Brundavan Gardens, Guntur (A.P)-522006. RNI No. 52813/1993.
Administration Office : 126-352, Between 4th & 5th lanes , Kodandarama Nagar, Gorlavaripalem Donka, Gorantla, Guntur (AP)-522034. Ph 8106539118, 7416812467